

సత్యసాయి మహాసమాధి



సర్వం సిద్ధం

నేడు సత్యసాయిబాబా జయంత్యుత్సవం

దేశవిదేశాల నుంచి తరలివచ్చిన భక్తులు

6

సాయి విద్యావిధానం... ఆదర్శం

శ్రీసత్యసాయి వర్సిటీ స్నాతకోత్సవంలో వక్తలు

విద్యార్థులకు బంగారు పతకాల ప్రదానం

6



వేదపఠనం చేస్తున్న విద్యార్థులు

గవర్నర్‌కు ఘన స్వాగతం



గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి నవంబరు 22(ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా 99వ జయంత్యుత్సవాల్లో పాల్గొనడానికి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ జిల్లాకు వచ్చారు. శుక్రవారం రాత్రి 10.49 గంటలకు జిల్లా సరిహద్దు చిలమత్తూరు మండలం కొడికొండ చెక్‌పోస్టులోని రక్ష అకాడమీకి చేరుకున్నారు. ఆయనకు కలెక్టర్ టీఎస్ చేతన్, జేసీ అభిషేక్‌కుమార్, అనంతపురం డీఐజీ షీమోషి, ఎస్పీ రత్న స్వాగతం పలికారు. కాసేపు విశ్రాంతి తీసుకుని, తర్వాత ప్రశాంతి నిలయం సాయి శ్రీనివాస్ అతిథిగృహం చేరుకున్నారు.

వైసీపీలో సస్పెన్షన్ల కాక







ఉషశ్రీ, శంకర్‌నారాయణ వర్గాల మాటల యుద్ధం

- పరస్పరం అక్రమాల ఆరోపణలు
- వేడెక్కిన గోరంట్ల రాజకీయం



ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న శంకర్‌నారాయణ వర్గీయులు (ఫైల్)

హిందూపురం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పెనుకొండ నియోజకవర్గ వైసీపీలో సస్పెన్షన్లు కాక పుట్టిస్తున్నాయి. వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ, మాజీ మంత్రి శంకర్ నారాయణ వర్గాలు తగ్గేదేలే అన్నట్లు మాటల యుద్ధానికి దిగుతున్నాయి. గోరంట్ల మండలానికి చెందిన ముగ్గురు శంకర్‌నారాయణ వర్గీయులను కొన్నిరోజుల క్రితం సస్పెండ్ చేయడం రెండువర్గాల మధ్య అగ్గి రాజేసింది. మొన్నటి వరకు ఉషశ్రీ వర్గీయులు.. శంకర్‌నారాయణ, ఆయన సోదరులపై విమర్శలు గుప్పించారు. శంకర్‌నారాయణ వర్గీయులు కూడా ఈనెల 20వ తేదీన గోరంట్లలో సమావేశమై ఉషశ్రీపై ధ్వజమెత్తారు. ఒకే మండలంలో ముగ్గురు ముఖ్య నాయకులను ఉషశ్రీ సస్పెండ్ చేయడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడింది. ఉషశ్రీని పెనుకొండ నుంచి పంపించేస్తేనే పార్టీకి మేలు చేకూరుతుందనీ 'సేవ్ పెనుకొండ, గోబ్యాక్ ఉషశ్రీ' అంటూ శంకర్‌నారాయణ వర్గీయులు ప్లకార్డులు పట్టారు. ఆ మరుసటి రోజే ఈనెల 21న ఉషశ్రీ వర్గీయులు సమావేశమై శంకర్‌నారాయణకు బినామీలుగా ఆయన సోదరులు గోరంట్ల మండలంలో వ్యవహరించారని ధ్వజమెత్తారు. ఆయన వర్గీయుల అవినీతిపై సీబీఐతో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు.

రగులుతున్న ఇరువర్గాలు

గోరంట్ల మండలానికి చెందిన ముగ్గురు ముఖ్య నాయకులను పార్టీ సస్పెండ్ చేసింది. దీంతో శంకర్‌నారాయణ వర్గం ఒక్కసారిగా ఆగ్రహంతో ఊగిపోతోంది. పార్టీకోసం అహర్నిషలు కృషిచేశామనీ, 2019కి ముందు ప్రతిపక్షంలో ఉంటూ ఎన్నో ఇబ్బందులు పడ్డామనీ, అయినా తమను ఉన్నఫలంగా పార్టీ నుంచి సస్పెండ్ చేయడం ఏంటని వారు రగులుతున్నారు. ఇందులో గిరిజన సామాజికవర్గానికి చెందిన నాయకుడైతే ఉషశ్రీపై నిప్పులు చెరిగారు. ఎన్నికల ముందు ఉషశ్రీ డబ్బు అడిగారనీ, ఇవ్వనందుకే తనపై కక్షగట్టారని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉషశ్రీ ఆగడాలపై ఉద్యమం చేపడతామన్నారు. ముగ్గురిని సస్పెండ్ చేయడం కాదనీ, చేతనైతే తమ వెనుక ఉన్న 300 మంది నాయకులు, కార్యకర్తలపై చర్యలు తీసుకోవాలని సవాల్ విసిరారు. మిగిలిన ఇద్దరు నాయకులు కూడా అదేస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ పరిస్థితుల్లో ఈ సస్పెన్షన్ రాజకీయం ఎక్కడికి దారితీస్తుందోనని మండలంలోని ఆ పార్టీకి చెందిన తటస్థ నాయకులు ఆవేదన చెందుతున్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఉషశ్రీ వర్గీయులు

సేవ్ పెనుకొండ.. ఉషశ్రీ గోబ్యాక్

గోరంట్లలో ఈనెల 20న సమావేశమైన శంకర్‌నారాయణ వర్గీయులు.. ఉషశ్రీపై ఆరోపణలు గుప్పించారు. రాప్తాడు సిద్ధం సభకు వచ్చిన డబ్బును ఉషశ్రీ దిగమింగారనీ, దీనిని ఎండగడతామని ధ్వజమెత్తారు. జిల్లా అధ్యక్షురాలిగా ఉన్నానని ఏది పడితే అది చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. కళ్యాణదుర్గంలో బీసీలు, గిరిజనులను వాడుకుని వారిని ముప్పతిప్పలు పెట్టారంటూ మండిపడ్డారు. ఉషశ్రీ పెనుకొండ నియోజకవర్గంలో ఉంటే పార్టీ నాశనం అవుతుందనీ, ఆమెను ఇక్కడినుంచి పంపించేందుకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఏది ఏమైనా పెనుకొండ నియోజకవర్గంలో గోరంట్ల మండలంలో ముగ్గురు నాయకుల సస్పెన్షన్ ఆ పార్టీలోని రెండు వర్గాల్లో కాక పుట్టిస్తోంది. అధికారం ఉన్నపుడు నాయకులు చేసిన తప్పులపై ఇప్పుడు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

సీబీఐ విచారణకు ఉషశ్రీ వర్గం డిమాండ్

నిన్నటివరకు శంకర్‌నారాయణ వర్గంపై ఉషశ్రీ వర్గీయులు కొంతమేర ఆరోపణలు చేస్తూ వచ్చారు. గురువారం గోరంట్లలో సమావేశమైన ఉషశ్రీ వర్గీయులు స్వరం పెంచి శంకర్‌నారాయణ.. తన సోదరులు, మరికొంతమందిని బినామీలుగా పెట్టుకున్నారని వారిపై సీబీఐతో విచారణ చేయించాలని డిమాండ్ చేయడం పార్టీలో మరింత అగ్గి రాజేసింది. సస్పెండైన నాయకులు శంకర్‌నారాయణకు బినామీలుగా ఉన్నారంటూ ఆరోపించారు. పార్టీ ఆవిర్భావం నుంచి వెంట ఉన్న ఒక సామాజికవర్గాన్ని నియోజకవర్గంలో అణగదొక్కారంటూ విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ కేసులు కూడా పెట్టించిన ఘనత శంకర్‌నారాయణకే దక్కుతుందని మండిపడ్డారు.

అభివృద్ధి కంటే అవినీతే ఎక్కువ

పెనుకొండ నియోజకవర్గంలో 2019లో గెలుపొందిన శంకర్‌నారాయణ, ఆ తరువాత కళ్యాణదుర్గం నుంచి పెనుకొండకు దిగుమతి అయిన ఉషశ్రీ చెరో రెండున్నరేళ్లపాటు మంత్రులుగా పనిచేశారు. ప్రస్తుతం ఇరువర్గాలు ఆరోపణలు, ప్రతిఆరోపణలు, విమర్శలు చేసుకోవడం చూస్తుంటే వీరు నియోజకవర్గాల అభివృద్ధికి చేసింది గోరంతేననీ, స్వప్రయోజనాల కోసం అవినీతికి పాల్పడిందే ఎక్కువగా ఉన్నట్లు సామాన్యులు భావిస్తున్నారు. అధికారంలో ఉన్నపుడు దోచుకుని దాచుకున్నారు. ప్రస్తుతం నియోజకవర్గ ఇన్‌చార్జి పదవుల కోసం ఒకరి అవినీతిని మరొకరు ఆరోపించుకుంటూ రోడ్డెక్కుతున్నారు. జనం మాత్రం ఇలాంటి వారికి తాము ఓటేశామా అంటూ మదనపడుతున్నారు. ఏది ఏమైనా పెనుకొండ నియోజకవర్గంలో మాజీ మంత్రుల మధ్య సాగుతున్న ఆధిపత్య పోరు ఎక్కడికి దారితీస్తుందో వేచి చూడాలి. వీరు ప్రతిపక్షంలో ఉన్నపుడు పార్టీని బజారుకీడ్చడం ఒకరి అక్రమాలపై మరొకరు ఆరోపణలు గుప్పించడం చూస్తున్న కొంత మంది వైసీపీ నాయకులు ఆవేదన చెందుతున్నారు.

ఎంఎస్ఎంఈ సర్వే పక్కాగా చేపట్టాలి: కలెక్టర్



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి టౌన్, నవంబరు22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమ (ఎంఎస్ఎంఈ)ల సర్వే పక్కాగా చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్.. సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం పరిశ్రమల శాఖాధికారులతో ఎంఎస్ఎంఈ సర్వే, నిర్వహణ, టర్నోవర్ తదితర అంశాలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని వాణిజ్య, సేవారంగ సంస్థలు, ఉత్పత్తిదారులకు సర్వేపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. సచివాలయ సిబ్బంది క్షేత్రస్థాయిలో మొబైల్ యాప్ ద్వారా సర్వే చేపట్టాలన్నారు. ఆయా పరిశ్రమలకు సంబంధించిన ఉపాధి కల్పన, ప్రస్తుతం బ్యాంకుల ద్వారా అందుతున్న రుణాలు, రాయితీలు తదితర వివరాలు పొందుపరచాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ నాగరాజు, సచివాలయ నోడల్ అధికారి సుధాకర్ రెడ్డి, వాణిజ్య పన్నుల శాఖాధికారి కృష్ణవేణి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య పాల్గొన్నారు.

ఉపాధి

పనిదినాలు పెంచాలి

అసెంబ్లీలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి ప్రస్తావన

పుట్టపర్తిరూరల్, నవంబరు22 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు పనిదినాలను 100 నుంచి 150 రోజులకు పెంచాలని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి శుక్రవారం శాసనసభలో ప్రస్తావించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శ్రీసత్యసాయి జిల్లాలో 10 మండలాలను కరువు పీడిత ప్రాంతాలుగా గుర్తించారన్నారు. ఆయా మండలాల్లో కూలీలకు పనులు దొరక్క తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సభదృష్టికి తీసుకెళ్లారు. ఆయా మండలాలను ప్రత్యేకంగా పరిగణించి, వాటి పరిధిలోని ఉపాధి కూలీలకు అధిక పనిదినాలు కల్పించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే కోరారు. వ్యవసాయంపై ఆధారపడిన రైతాంగం పంట పెట్టుబడులు భరించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేస్తే అటు రైతులు, ఇటు కూలీలకు ఉపయోగకరంగా ఉంటుందని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఉపాధి పనులకు వెళ్లే కూలీలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఎమ్మెల్యే ప్రస్తావించిన అంశాలను తప్పకుండా పరిగణనలోకి తీసుకుంటామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు.



శాసనసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

ప్రశాంతి నిలయంలో భక్తుల సందడి



సర్వం సిద్ధం

నేడు సత్యసాయి 99వ జయంత్యుత్సవం

- దేశవిదేశాల నుంచి వచ్చిన భక్తులు
- ముఖ్యఅతిథిగా గవర్నర్ అబ్దుల్ నజీర్
- పోలీస్ వలయంలో పుట్టపర్తి

పుట్టపర్తి, నవంబరు22(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తి సత్యసాయి జయంత్యుత్సవాలకు ముస్తాబైంది. సత్యసాయి బాబా 99వ జయంతి వేడుకులకు దేశవిదేశాల నుంచి భక్తులు పుట్టపర్తికి రావడంతో సందడి నెలకొంది. సత్యసాయి 99వ జయంతి వేడుకలకు వేదికైన సత్యసాయి సన్నిధి సాయికుల్వంత్ మందిరాన్ని దేదీప్యమానంగా తీర్చిదిద్దారు. పుట్టపర్తి పురవీధుల్లో తోరణాలు, విద్యుత్ కాంతులతో అలంకరించారు. సాయికుల్వంత్ మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత జయంతి వేడుకలు శనివారం ఉదయం 8 గంటలకు ప్రారంభమ్మైతాయి. 9.10కి సత్యసాయి ట్రస్టు వార్షిక నివేదిక విడుదల చేస్తారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరుకానున్నారు. సాయంత్రం స్వర్ణ రథంపై సత్యసాయి చిత్రపటం ఊరేగిస్తారు.

పుట్టపర్తిలో సందడి

సత్యసాయి 99వ జయంత్యుత్సవాలను తిలకించేందుకు ప్రముఖులతోపాటు దేశవిదేశాల భక్తులు తరలివచ్చారు. ప్రశాంతి నిలయంతోపాటు పట్టణంలోని వీధులు ఇప్పటికే భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ప్రశాంతి నిలయంలో ఎటుచూచిన జనమే కన్పిస్తున్నారు. సత్యసాయి మహాసమాధిని భక్తులు పెద్ద సంఖ్యలో సందర్శించారు. పుట్టపర్తి వీధుల్లో భక్తులు సందడి కల్పించింది. పుట్టపర్తికి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌తోపాటు ప్రముఖులు, దేశ విదేశాల భక్తులు రానున్న నేపథ్యంలో జిల్లా పోలీస్ యంత్రాంగం భారీ భద్రతా ఏర్పాట్లు చేసింది. పుట్టపర్తికి వచ్చే ప్రధాన రహదారులతోపాటు ప్రశాంతి నిలయంలో దారిపొడవునా పోలీసులు కన్పిస్తున్నారు. జయంతి వేడుకల్లో పాల్గొనే భక్తులు, ప్రజలకు తాగునీరు, వైద్యసేవలు, వాహనాల పార్కింగ్, తాత్కాలిక వసతి, సమాచారకేంద్రాలను అధికారయంత్రాంగం ఏర్పాటు చేసింది.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు: శుక్రవారం సాయంత్రం సాయికుల్వంత్ సభామండపంలో సత్యసాయి హయ్యర్ సెకండరీ విద్యార్థులు సంగీత సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సత్యసాయి ఆధ్యాత్మికత సేవలు, బోధనలపై చేపట్టిన నాటిక భక్తులను అలరించేసింది. సాయికుల్వంత్‌లో ప్రత్యేక దీపాలంకరణ చేశారు.

నేడు జయంతి వేడుకలు: శ్రీసత్యసాయిబాబా 99వ జయంతి వేడుకలు ప్రశాంతినిలయంలోని సాయికుల్వంత్‌లోని సభామండపంలో శనివారం నిర్వహిస్తారు. ఇందు కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. వేడుకలలో పాల్గొనడానికి వేలాది మంది భక్తులు తరలివచ్చారు.





ప్రసంగిస్తున్న సేతురామన్



సేతురామన్‌ను సత్కరిస్తున్న ఆర్‌జే రత్నాకర్









విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేస్తున్న యూఎస్ నేషనల్ సైన్స్ ఫౌండేషన్ డైరెక్టర్ సేతురామన్ పంచనాథన్, యూనివర్సిటీ చాన్సిలర్ చక్రవర్తి

అతిథులకు విద్యార్థుల స్వాగతం



సాయి విద్యావిధానం... ఆదర్శం

- శ్రీసత్యసాయి వర్సిటీ స్నాతకోత్సవంలో వక్తలు
- విద్యార్థులకు బంగారు పతకాల పంపిణీ
- అట్టహాసంగా వేడుకలు

పుట్టపర్తి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): వ్యక్తిత్వ వికాసం, మానవత్వం, సామాజిక స్పృహతో కూడిన సత్యసాయి విద్యావిధానం ప్రపంచంలోనే అందరికి ఆదర్శమని యూఎస్ నేషనల్ సైన్స్ ఫౌండేషన్ డైరెక్టర్ సేతురామన్ పంచనాథన్ కొనియాడారు. శుక్రవారం ప్రశాంతి నిలయంలోని పూర్ణచంద్రహాల్‌లో శ్రీసత్యసాయి యూనివర్సిటీ 43వ స్నాతకోత్సవాలు ఘనంగా నిర్వహించారు. మొదట ముఖ్యఅతిథులు, వీసీ, అధ్యాపకులను విద్యార్థులు మంగళవాయిద్యాలతో వేదిక వద్దకు తీసుకొచ్చారు. విద్యార్థులు వేద పఠనంతో ఈ వేడుకలు ప్రారంభమయ్యాయి. సేతురామన్ పంచనాథన్ మాట్లాడుతూ... సత్యసాయి విద్యావిధానంతో విద్యార్థులు సంపూర్ణ వ్యక్తిత్వ వికాసంతో బయటకు వస్తున్నారన్నారు. ప్రపంచంలో పలు యూనివర్సిటీలు సందర్శించానని, ఇటువంటి విలువలతో కూడిన విద్యావిధానాన్ని ఎక్కడా చూడలేదన్నారు. సత్యసాయి విద్యార్థులుగా సత్యసాయి బోధనలు, ఆధ్యాత్మికతను ప్రచారం చేయాలని కాంక్షించారు. అనంతరం సేతురామన్‌ను సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ సన్మానించారు.

21 మందికి బంగారు పతకాలు

సత్యసాయి యూనివర్సిటీలో ఉత్తమ ఫలితాలు సాధించిన 21 మంది విద్యార్థులకు ముఖ్యఅతిథి సేతురామన్, యూనివర్సిటీ చాన్సిలర్ చక్రవర్తి బంగారు పతకాలు అందజేశారు. మరో 14 మందికి పీహెచ్‌డీలను ప్రదానం చేశారు. 463 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందజేశారు. స్నాతకోత్సవంలో సత్యసాయి యూనివర్సిటీ పరిధిలోని ప్రశాంతి నిలయం క్యాంపస్, అనంతపురం మహిళా క్యాంపస్, బెంగళూర్‌లోని బృందావనం, చిక్‌బళాపురంలోని ముద్దనహళ్లి క్యాంపస్ విద్యార్థులు పాల్గొన్నారు.

పాల్గొన్న ప్రముఖులు

స్నాతకోత్సవంలో వీసీ రామవేంద్రప్రసాద్, ట్రస్టు సభ్యులు డాక్టర్ మోహన్, నాగానందం, మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి, సేవాసంస్థల ప్రతినిధులు నిమీష్‌పాండే, చీర, కోటేశ్వరరావు, దేశవిదేశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి విద్యార్థి మృతి





చరణ్ మృతదేహం, ఆస్పత్రిలో విలపిస్తున్న తల్లిదండ్రులు

గుంతకల్లుటౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఈతకు వెళ్లిన విద్యార్థి మృతి చెందడంతో ఆ కుటుంబం శోకసముద్రంలో మునిగిపోయింది. మండలంలోని నెలగొండ గ్రామానికి చెందిన గోవిందు, శకుంతల దంపతులకు చరణ్, ఒక కూతురు ఉన్నారు. చరణ్(14) గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. తండ్రి గోవిందు ఉపసర్పంచుగా కొనసాగుతున్నాడు. అతడు వ్యవసాయం, కూలీ పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం చరణ్ స్కూల్‌కు వెళ్లలేదు. గోవిందు అన్న కొడుకులు చెన్నకేశవులు, సింహాద్రి, చిన్న గొర్రెలు మేపడానికి గ్రామ శివారులోని చెక్‌డ్యాం వద్దకు వెళ్లారు. సెల్‌ఫోన్‌లో గేమ్ ఆడడానికి చరణ్ కూడా మధ్యాహ్నం అక్కడికి వెళ్లాడు. చెక్‌డ్యాంలో కాసేపు ఈత కొట్టాడు. మధ్యలోకి వెళ్లొద్దు లోతు ఎక్కువగా ఉందని చెన్నకేశవులు వారించి భోజనం చేసేందుకు వెళ్లాడు. తనకు ఈత వచ్చు అని చెప్పి చరణ్ మధ్యలోకి వెళ్లాడు. భోజనం చేసి వచ్చేసరికి చరణ్ కనిపించలేదు. దీంతో చుట్టు పక్కల పొలాల్లో ఉన్న వారిని పిలిచాడు. సుమారు గంటన్నరపాటు నీటిలో వెతకగా చరణ్ దొరికాడు. వెంటనే చికిత్స నిమిత్తం గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అతడు అప్పటికే మృతి చెందాడన్నారు. విషయం తెలుసుకున్న పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, గ్రామస్థులు ప్రభుత్వా ఆసుపత్రికి చేరుకున్నారు. చరణ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సంఘటనపై రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. చరణ్ నిద్రపోతున్నాడని, తాను పిలిస్తే లేస్తాడని తల్లి శకుంతల కొడుకు మృతదేహం పడి రోధించిన తీరు అందరిని కలచివేసింది. చరణ్ లే ఇంటికి పోదామంటూ ఆమె విలపించింది.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

చెన్నేకొత్తపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దామాజిపల్లి సమీపంలో రైలు కిందపడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. హిందూపురం రైల్వేపోలీసు హెడ్‌కానిస్టేబుల్ ఎర్రిస్వామి తెలిపిన మేరకు రామగిరి మండలం పోలేపల్లి గ్రామానికి చెందిన మురళి(32) కియా కార్ల కంపెనీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈక్రమంలో భార్యతో గొడవపడి ఇంటి నుంచి బయటకు వచ్చి క్షణికావేశంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే కీమ్యాన్, లోకోపైలెట్ ఇచ్చిన సమాచారం మేరకు హెడ్‌కానిస్టేబుల్ ఎర్రిస్వామి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఘటనా స్థలం వద్ద బ్యాగులో ఉన్న ఆధార్‌కార్డు ఆధారంగా మృతుడి వివరాలు తెలుసుకుని కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. కుటుంబసభ్యులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించిన అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మురళికి భార్య అంబిక, కుమార్తె, కుమారుడు ఉన్నారు. హిందూపురం రైల్వేపోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

గల్ఫ్ దేశాలకు అనంత అరటి

- బనానా రైలును వర్చువల్‌గా ప్రారంభించిన ప్రిన్సిపల్ సెక్రటరీ..
- హాజరైన ఎంపీ, కలెక్టర్ హాజరు



జెండా ఊపి రైలును ప్రారంభిస్తున్న ఎంపీ, మున్సిపల్ చైర్మన్, కలెక్టర్, అధికారులు

తాడిపత్రి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా అరటి గల్ఫ్‌దేశాలకు ఎగుమతి అవుతోంది. ఈ సందర్భంగా శుక్రవారం తాడిపత్రి రైల్వేస్టేషన్‌లో ముంబై వరకు బనానా రైలును ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్, గుంటూరు సిరికల్చర్ డైరెక్టర్ శ్రీనివాసులు వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా తాడిపత్రి రైల్వేస్టేషన్‌లో బనానా రైలును ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, కలెక్టర్ వినోద్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. అంతకు ముందు ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ అనంతపురం జిల్లా అరటి ఉత్పత్తులు అంతర్జాతీయ స్థాయికి చేరడం శుభపరిణామన్నారు. ముంబై నుంచి షిప్‌ద్వారా ఇరాక్ దేశానికి వెళ్లడం ఈ అరటికి ఎంత గిరాకీ ఉందో అర్థమవుతోందన్నారు. ప్రిన్సిపల్ సెక్రటరీ మాట్లాడుతూ 2003లో అనంతపురం జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన సమయంలో కరువు బారి నుంచి జిల్లాను కాపాడడానికి ప్రణాళికలు అమలు చేసేవారమని గుర్తు చేసుకున్నారు. జిల్లాను ఫ్రూట్స్ హబ్‌గా మార్చిన అధికారులు, ప్రజాప్రతినిధులకు అభినందనలు తెలిపారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జిల్లా అరటిని ప్రపంచంలో అగ్రగామిగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పనిచేస్తున్నారని తెలిపారు. 2016లోనే ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టితో ఆలోచించి రైతులకు అనేక సదుపాయాలు కల్పించారన్నారు. లక్ష టన్నులకు ఎగుమతులు చేసేస్థాయికి జిల్లా చేరుకోవడం సీఎం ముందు చూపుతోనే సాధ్యమైందన్నారు. మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో అరటి, దానిమ్మ, చీనీ, సపోటా, బొప్పాయి పండ్లతోటలకు ప్రసిద్ధిగాంచిందన్నారు. ఒకప్పుడు రాయలసీమ అంటే రాళ్ల సీమ అనేవారని ప్రస్తుతం పంటలు పండించుకుంటూ రతనాల సీమగా తయారైందని సంతోషం వ్యక్తం చేశారు. కలెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాను వివిధ ఉద్యానవన పంటల ఉత్పత్తికి కేంద్రంగా పరిగణించవచ్చన్నారు. జిల్లాకు ప్రత్యేక వాతావరణ పరిస్థితులు, సామర్థ్యాలు ఉన్నాయని, ఇవి ఏడాది పొడవునా సాగుకు అనుకూలంగా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో న్యూఢిల్లీ ఏపీఈడీఏ జనరల్ మేనేజర్ వినీతసుధన్షు, హైదరాబాద్ కంటైనర్ కార్పొరేషన్ సీనియర్ జనరల్ చెక్ మేనేజర్ అనిత బారిక్, జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ, శ్రీకృష్ణ ఇంపెక్స్ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ అనిల్ ఎఅగర్వాల్, ఆర్డీఓ కేశవనాయుడు, హార్టికల్చర్ డీడీ నరసింహారావు, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, మార్కెటింగ్ ఏడీ సత్యనారాయయణచౌదరి, ఎస్‌బీసీ డీఐఓ రవిశంకర్, ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి, ఏడీ ఫిరోజ్ ఖాన్, రైల్వేస్టేషన్ మాస్టర్ అనిల్ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేపు కార్తీక వనభోజన మహోత్సవం

రాప్తాడు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): అఖిల భారత కాకతీయ ఉమ్మడి అనంతపురం జిల్లా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వనభోజన మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. రాప్తాడు మండలం హంపాపురం వద్ద 44వ జాతీయ రహదారి పక్కన నాగశేషు వ్యవసాయ క్షేత్రంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంఘం కుటుంబ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధ దంపతుల దుర్మరణం

ముదిగుబ్బ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో నాగారెడ్డిపల్లికి చెందిన దంపతులు గంగన్న (80), నరసమ్మ (75) మరణించారు. వీరు మలకవేములక్రాస్‌కు వచ్చారు. తిరిగి ఆటోలో స్వగ్రామానికి వెళ్లేందుకు నాగారెడ్డిపల్లి క్రాస్ వద్ద దిగారు. రోడ్డు దాటుతుండగా ముదిగుబ్బ వైపు నుంచి కదిరి వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో వారిద్దరూ అక్కడికక్కడే మరణించారు. వీరికి ముగ్గురు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పట్నం ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు.

ప్యాసింజరు రైళ్ల నంబర్ల మార్పు

గుంతకల్లు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు రైల్వే డివిజన్‌కు చెందిన పలు ప్యాసింజరు రైళ్ల నెంబర్లను మార్పు చేసినట్లు అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మార్పు జనవరి 1వ తేదీ నుంచి అమలులోకి వస్తున్నందన్నారు. వివిధ రైళ్ల మారిన నెంబర్లు ఇలా ఉన్నాయి.

ప్యాసింజరు రైలు	పాత నంబరు	కొత్త నంబరు
గుంతకల్లు-డోన్	07288	77203
డోన్-గుత్తి-డోన్	07289/90	77205/06
కర్నూలుసిటీ-గుంతకల్లు	07292	77204
గుంతకల్లు-హిందూపురం-గుంతకల్లు	07693/94	77213/14
గుంతకల్లు-రాయచూరు-గుంతకల్లు	07799/800	77201/02

ఊయలలో ఊపిరి ఆడకే

పోస్టుమార్టం నివేదికలో వెల్లడి

చిన్నారి మృతి..!



ప్రాణాలు వదిలిన ఐదునెలల పసికూన(ఫైల్)

అనంతపురం టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఊయలలో ఊపిరి ఆడకపోవడంతో పసిబిడ్డ మృతి చెందే అవకాశం ఉన్నట్లు జిల్లా సర్వజనాస్పత్రి వైద్యులు వెల్లడించారు. రెండు రోజుల కిందట నార్పలలో ఓఆర్యవైశ్య కుటుంబం అప్పులు బాధ తాళలేక ఆత్యహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈ సమయంలో వారి ఐదు నెలల కుమారుడు కూడా చనిపోయాడు. అయితే ఆ పసిబిడ్డ మరణంపై రకరకాల వాదనలు వెలువడ్డాయి. పసిబిడ్డను ముందుగానే చంపి వారు ఆత్మహత్య చేసుకున్నారా? లేక పాప ఊయలలో పడుకున్న సమయంలో వారు ఆత్యహత్య చేసుకున్నారా? అని రకరకాల ప్రశ్నలు తలెత్తాయి. పోలీసులు సైతం పసి బిడ్డను తల్లిదండ్రులు చంపలేదని, అలాంటి ఆనవాళ్లు కనిపించలేదని మృతదేహాన్ని పరిశీలించినప్పుడే పోలీసులు నిర్ధారణకు వచ్చారు. పోస్టుమార్టమ్ నిర్వహించిన జిల్లా సర్వజన ఆస్పత్రి ఫోరెన్సిక్ డాక్టర్లు ఆ పసిబిడ్డను ఎవరు చంపలేదని నిర్ధారించారు. తల్లిదండ్రులు ముందుగానే ఇంట్లో ఉన్న ఊయలలో ఆ పసిబిడ్డను బోర్లా పడుకోబెట్టారని, దీని వల్ల ఊపిరి ఆడక మరణించి ఉండే అవకాశం ఉందన్నారు. నెలల చిన్నారిని ఇలా ఊయలలో బోర్లా పడుకోబెడితే పక్కకు తిరగలేదని, అలాంటపుడు ఊపిరి ఆడక మూడు నుంచి ఐదు నిమిషాలలోనే పసిపిల్లలు చనిపోతారని ఫోరెన్సిక్ విభాగం హెచ్‌ఓడీ డాక్టరు శంకర్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. దీనిని వైద్య పరిభాషలో సఫోకేషన్ అని అంటారని ఆయన అన్నారు. నార్పల ఘటనలో కూడా ఇదేజరిగి ఉండవచ్చని, దీని వల్లే పసిబిడ్డ చనిపోయిందని వెల్లడించారు.

సూసైడ్ నోట్‌లో ఏముందో?

కృష్ణకిషోర్ దంపతుల సూసైడ్ నోట్‌ను బయటపెట్టని పోలీసులు

నార్పల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కృష్ణకిషోర్, శిరీష దంపతుల ఆత్మహత్యపై భిన్న కథనాలు వినపడుతున్నాయి. కృష్ణకిషోర్ కుటుంబం ఆత్మహత్య చేసుకునే ముందు అప్పుల గురించి సూసైడ్ నోట్ రాసినట్లు సమాచారం. ఆ నోట్‌ను పోలీసులు తీసుకుని, బయటికి విడుదల చేయలేదు. అయితే ఆ సూసైడ్ నోట్‌లో కృష్ణకిషర్ అప్పుల మొత్తం ఎంత ఉంది? అప్పులు చెల్లించాలని ఎవరూ వేధిస్తున్నారు? తన బంధువులు కుటుంబికుల మధ్య ఉన్న విభేదాలు తదితర వాటిపై అందులో ఏమైనా రాశాడా? అన్న విషయాలు చర్చనీయాంశంగా మారాయి. సూసైడ్ నోట్ గురించి నార్పల ఎస్‌ఐ సాగర్‌ను అడగగా నోట్ రాసింది నిజమేనని, అందులో ఏమి లేదని తెలిపారు.

ముగ్గురి మృతదేహాలకు అంత్యక్రియలు పూర్తి

కృష్ణకిషోర్, శిరీష, వారి బాబుకు అనంతపురంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి అనంతపురంలోనే అంత్యక్రియలను పూర్తి చేశారు. ఈ అంత్యక్రియలకు కృష్ణకిషోర్ అన్న రమేష్, మృతురాలి అక్కతో పాటు మరో పది మంది బంధువులు మాత్రమే హాజరుకావడం గమనార్హం. అయితే 20ఏళ్ల నుంచి తన తమ్ముడు కృష్ణకిషోర్‌తో ఆస్తి విషయంలో మాటలు లేవని పోలీసుల ఎదుట మృతుడి అన్న రమేష్ తెలిపాడు. దాదాపు రూ. 50లక్షలు వరకు అప్పులు ఇచ్చిన వారు ఎవరూ కూడా ఎవరూ అటువైపు కన్నెత్తి చూడలేదు.

పాప కాదు.. బాబు

కృష్ణకిషోర్, శిరీష దంపతులు ఆత్మహత్య చేసుకోవడంతో ఊయలలో చనిపోయిన బిడ్డ పాపేనని తొలుత అందరూ భావించారు. బంధువులు కూడా పాపా, లేక బాబా అనే విషయంలో స్పష్టత ఇవ్వలేదు. మృతి చెంది దాదాపు నాలుగు రోజులు కావడంతో మృతదేహాలు గుర్తించలేని స్థితిలో ఉండటంతో చనిపోయింది పాపే అని అందరూ అనుకున్నారు. పోలీసులు అలాగే భావించి వివరాలు వెల్లడించారు. అయితే మృతదేహాలను ఆస్పత్రికి తరలించిన తర్వాత అసలు విషయం తెలిసింది. చనిపోయింది పాప కాదు బాబు అని వెల్లడైంది.



వేణుగోపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న అభిమానులు

ఘనంగా టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడి జన్మదినం

ధర్మవరంరూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుణుతూరులో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీపీ వేణుగోపాల్‌రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఆయన ఇంటివద్దకు వెళ్లి ఆయనతో కేక్ కట్ చేయించి గజమాలతో సన్మానించి.. శుభాకాంక్షలు తెలిపారు.





మాట్లాడుతున్న ఎస్పీ రత్న, పాల్గొన్నవారు

సత్యసాయి జయంతికి పటిష్ట బందోబస్తు

పుట్టపర్తిరూరల్, నవంబరు 22:

సత్యసాయిబాబా 99వ జయంత్యుత్సవాలకు భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ రత్న తెలిపారు. శుక్రవారం ఆమె పోలీస్ సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. అనంతరం మాట్లాడుతూ.. ఈ ఉత్సవాలకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ తో పాటు పలువురు ప్రముఖులు, భారీసంఖ్యలో భక్తులు వస్తున్నారన్నారు. దీంతో బందోబస్తు నిమిత్తం ఆరుగురు డీఎస్పీలు, 23 మంది సీఐలు, 48 మంది ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెడ్‌ఏఎస్ఐలు, 171 మంది పోలీసు కానిస్టేబుల్స్ 300 మంది, మహిళా కానిస్టేబుళ్లు 26 మంది, హోంగార్డులు 170 మంది, నాలుగు స్పెషల్ పార్టీ బృందాలను నియమించినట్లు చెప్పారు. ఎస్పీ వెంట ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, డీఎస్పీలు విజయ్‌కుమార్, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, ఎస్బీ సీఐ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, ఎస్ఐ ప్రదీప్‌కుమార్, సీఐలు, ఎస్ఐలు, ఉన్నారు.



ఉదయం ఎనిమిది గంటల సమయంలో కదిరి, హిందూపురం ప్రధాన రహదారిలో పొగమంచు



లైట్లు వేసుకుని వస్తున్న వాహనాలు

కమ్ముకున్న పొగమంచు

ఓబుళదేవరచెరువు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా పొగమంచు కమ్మేస్తోంది. దీంతో ఉదయం 8గంటలైనా రహదారులు పొగమంచుతో కప్పుకొని ఉండటంతో వాహనదారులు లైట్లు వేసుకుని ప్రయాణం చేయాల్సి వస్తోంది. కదిరి, హిందూపురం ప్రధాన రహదారి పొగమంచుతో నిండిపోవడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించడం లేదు. ఇళ్లలోనుంచి బయటకు రావాలంటే ప్రజలు జంకుతున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న న్యాయవాది సురేంద్ర



హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై హర్షం

కదిరి లీగల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కూటమి ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు కర్నూలు కేంద్రంగా హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు అసెంబ్లీలో ఆమోదించడంపై కదిరి న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం కదిరి న్యాయవాదులు సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ప్రధాన కార్యదర్శి సురేంద్ర మాట్లాడారు. అందుకు కారకులైన ముఖ్యమంత్రి నారాచంద్ర బాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి ఫారూఖ్, కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే కదిరిలో ఏడీజే కోర్టు ఏర్పాటు అంశాన్ని అసెంబ్లీలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ప్రస్తావించడం అభినందనీయమన్నారు.

మెస్‌చార్జీల బకాయిలు విడుదల చేయాలి

ధర్మవరం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): బకాయి హాస్టల్ మెస్ చార్జీలను విడుదల చేయాలని ఏపీఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండి శివగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలో విద్యార్థులతో కలిసి ఏపీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వసతి గృహాల్లోని విద్యార్థులకు సంబంధించిన ఆరు నెలల మెస్ చార్జీలు, కాస్మెటిక్స్ చార్జీలను వెంటనే విడుదల చేయాలన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభమై ఆరు నెలలు అవుతున్నా... వీరికి ప్రభుత్వం ఈ చార్జీలు విడుదల చేయలేదన్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు చలికాలం కావడంతో విద్యార్థులకు దుప్పట్లను కూడా పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఎఫ్ నాయకులు సుకృత్, దినేష్, స్వామి, కార్తీక్, పవన్ పాల్గొన్నారు.

భగవద్గీత పఠనంతో మనోధైర్యం

కదిరి అర్బన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో అందరూ ఒత్తిళ్లకు లోనవుతున్నారని, గీత పఠనంతో ప్రశాంతత, మనోధైర్యం పొందవచ్చని ఆర్డీఓ వీఎస్ఎస్ శర్మ అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం ముద్రించిన భగవద్గీత పుస్తకాలన్ని శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాల, వాల్మీకి పాఠశాలలతో ఆవిష్కరించిన ఆయన మాట్లాడారు. భగవద్గీతలో 18 అధ్యాయాలు ఉన్నాయని, ధర్మం, శాంతి, సహనం, పరోపకారాన్ని గీత బోధిస్తుందని అన్నారు. కార్యక్రమంలో టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ జిల్లా ఇన్‌చార్జీ శేషాద్రి, వాల్మీకి పాఠశాల కరస్పాండెంట్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఆస్పత్రి అభివృద్ధికి నిధుల మంజూరు

ధర్మవరం: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే సత్య కుమార్‌యాదవ్ చొరవతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధికి రూ.50 లక్షలు మంజూరయ్యాయి. ఇండియన్ ఆయిల్ కార్పొరే షన్ సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా ఈ ఆస్పత్రికి నిధులు వచ్చేలా కృషి చేశా రు. ఈ నిధులతో ఆస్పత్రిలో ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చేప ట్టాలన్న విషయంపై ఆ సంస్థ జిల్లా సేల్స్ మేనేజర్ మహేశ్, నియో జక వర్గ బీజేపీ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు ఆస్పత్రి సూపరింటెండెంట్ మాధవి తో చర్చించారు. దీనికి సంబంధించి నివేదిక సిద్ధం చేయాలని ఆమెను కోరారు.

అక్రమంగా తరలిస్తున్న మూగజీవాల పట్టివేత

నల్లచెరువు: అక్రమంగా తరలిస్తున్న 29 మూగజీవాలను మండల కేంద్రంలో శుక్రవారం పట్టుకున్నట్లు ఎఎస్ఐ షేక్షావలీ తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని షాద్‌నగర్ నుంచి ఈ మూగజీవాలను లారీలో తరలిస్తుండగా.. చెన్నై అనిమల్ బోర్డు సంస్థ తమిళనాడు సౌత్ జోన్ గోసంరక్షణ సమితి ఆధ్వర్యంలో పట్టుకున్నట్లు చెప్పారు. ఆ వాహనంలోని ఇద్దరిని అరెస్టు చేసి, కేసు నమోదు చేశామని చెప్పారు. పశువులను అన్నమయ్య జిల్లా తంబళ్లలోని గోశాలకు తరలించామన్నారు.

కమిషన్ ఏర్పాటుపై హర్షం

కదిరి అర్బన్: ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం ఏక సభ్య కమిషన్ ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామని మాదిగ ఉద్యోగ ఫెడరేషన్ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం అంబేద్కర్ సర్కిల్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు ముఖ్యమంత్రి మొదట నుంచి మద్దతుతెలుపుతూ అండగా నిలబడ్డారన్నారు. కచ్చితమైన సిఫార్సులు తీసుకురావడానికి విశ్రాంత ఐఏఎస్ అధికారి రాజీవ్‌రంజన్‌మిశ్రా నేతృత్వంలో ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో నాగేంద్రనాథ్, నాగప్ప, ఆదినారాయణ, ఆంజనేయులు, ఆనంద్, విశ్వనాథ్, నాగరాజు పాల్గొన్నారు.

అయ్యప్ప గీతాల సీడీ ఆవిష్కరణ

ఓబుళదేవరచెరువు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.కొత్తపల్లి బండపై వెలసిన అప్పయ్య ఆలయ ఆవరణంలో అడివిలో అందగాడు అనే పేరుతో రూపొందించిన భక్తిగీతాల సీడీని తహసీల్దార్ అనంతాచారి శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం లవులీ లక్ష్మణ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ సంకల్పకులు వచ్చర్ల ఆంజనేయుల నాయుడు, అఖిల భారతీయ అయ్యప్ప ప్రచార సభ రాష్ట్ర అధ్యక్షుడు హరిప్రసాద్, సొసైటీ బ్యాంక్ మేనేజర్ వెంకటాచలం, మాజీ అధ్యక్షుడు పిట్టా ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



దోచుకుంటున్న మీసేవ కేంద్రాలు

ముదిగుబ్బ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జనన ధ్రువీకరణ పత్రాల్లో మార్పులు, చేర్పుల పేరుతో స్థానిక మీసేవ కేంద్రాలు పేదల నుంచి భారీగా డబ్బు దండుకుంటున్నాయని టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ తుమ్మల మనోహర్ మండిపడ్డారు. శుక్రవారం స్థానికంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. జనన ధ్రువీకరణ పత్రాలలో ఇంటి పేరు, తప్పులు, ఇతర సవరణల కోసం పేదలు మీ సేవా కేంద్రాల దగ్గరికి వెళ్తుంటే.. వారి అవసరాలను అనరగా చేసుకుని రూ.1000, రూ.2వేలు డబ్బులు దండుకుంటున్నారన్నారు. ఈ విషయంపై తహసీల్దార్ నారాయణస్వామి దృష్టికి కూడా తీసుకెళ్లామ న్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చినగానినరసింహయాదవ్, వెంకటనారాయణ, చినగాని కిష్టయ్య, ఆనంద్, రామచంద్ర, శ్రీనివాసులు, వెంకటకృష్ణ, కొలససాని చంద్ర, గోపీనాథ్, స్టూడియో అశోక్, కుళ్లాయప్ప, ఇమాములు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జి మనోహర్

25న మెగా వైద్య శిబిరం

ధర్మవరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : వినికిడి సమస్యలు ఉన్న వారి కోసం ఈనెల 25న స్థానిక పోతుకుంట రోడ్డులోని నూతన ప్రభుత్వాస్పత్రిలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు బీజేపీ నాయకులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైద్య శిబిరంలో వినికిడి పరీక్షలు, చికిత్సలు, మిషన్ల కోసం నమోదు కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. మరిన్ని వివరాల కోసం ధర్మవరం నియోజకవర్గ ప్రజల దగ్గరలోని ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలను సంప్రదించాలని కోరారు.

పేర్లు నమోదు చేసుకోండి

నల్లచెరువు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలో రబీలో వేరుశనగ సాగుచేసే రైతులకు సబ్సిడీతో విత్తనకాయలు అందిస్తామని ఏఓ భారతి శుక్రవారం తెలిపారు. కె -6 రకం కావలసిన కాయలు రైతు సేవాకేంద్రంలో అందుబాటులో ఉన్నాయని, రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్, ఫోన్, తీసుకుని రావాలని అన్నారు. బోరు, బావుల కింది సాగుచేసే రైతులు తీసుకోవాలన్నారు. మండలానికి రెండు వందల క్వింటాళ్ల కాయలు వచ్చాయన్నారు. 30 కేజీల బస్తా రూ.1,728 ఉందన్నారు. ఒక రైతుకు మూడుబస్తాలు మాత్రమే ఇస్తామన్నారు.



25న కలెక్టరేట్ వద్ద ధర్నా

ధర్మవరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలోని పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని, దాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ కోరారు. శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. శానిటేషన్ వర్కర్స్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. పారిశుధ్య కార్మికులకు నాలుగు నెలలుగా జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం అమలు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కో-కన్వీనర్ అయూబ్‌ఖాన్, స్కూల్స్ శానిటేషన్ వర్కర్క్ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీదేవి, నాగేవేణి తదితరులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్ ..

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ధర్మవరం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక దుర్గానగర్‌కు చెందిన మల్లికార్జున అప్పుల బాధ తాళలేక శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అతను కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అప్పుల బాధ తాళలేక తీవ్ర మనస్థాపానికి గురైన అతను శుక్రవారం ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు అతన్ని వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అతనికి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు.

● దుర్గానగర్‌లో మహిళ...: స్థానిక దుర్గానగర్‌లో నివాసముంటున్న చంద్రకళ అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెందింది. శుక్రవారం ఇంట్లో విష ద్రావకం తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబసభ్యులు ఆమెను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు ఈ కేసులు దర్యాప్తు చేపట్టారు.

ఆరుగురిపై కేసు

కదిరి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక ఫర్వీన్‌బాను పెట్రోల్ బంక్ సమీపంలో ఇంటిస్థలం విషయం జరిగిన గొడవలో ఆరుగురిపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఫర్వీన్‌బాను పెట్రోల్ బంక్ సమీపంలో సర్వే నెంబర్ 959-4, 960-3లో రెండున్నర సెంట్ల స్థలం ఫర్వీన్‌బాను పేరుతో ఉంది. ఆ స్థలంపై వివాదం రావడంతో.. ఫర్వీన్‌బాను కోర్టు ద్వారా అనుమతి తీసుకుని, ఆ స్థలంలో ఫర్వీన్‌బాను, ఆమె సోదరుడు బాబాఫకృద్దీన్ గురువారం సాయంత్రం బండలు పాతడానికి వెళ్లారు. ఆ సమయంలో కొలిమి మహమ్మద్‌వలీఖాన్, యాజం అలీఖాన్, నయాజ్ అలీఖాన్, ఆసీఫ్, సల్మా, ఖాదర్‌బాషా, మరికొంతమంది నాటిన బండలను, సర్వేరాళ్లను తొలగించారు. అడ్డుకున్న ఫర్వీన్‌బానును రాళ్లతో కొట్టి గాయపరిచారు. దీనిపై బాధితురాలు ఫిర్యాదు చేయడంతో ఆ ఆరుగురిపై కేసు నమోదు చేశామని పట్టణ సీఐ నారాయణరెడ్డి శుక్రవారం తెలిపారు.









పట్టు జారుతోంది..!

తిరోగమనంలో మల్బరీ సాగు

సిబ్బందిలేమితో

కొట్టుమిట్టాడుతున్న శాఖ

వీఎస్ఏలను తీసుకుంటే

కొరత తీరే అవకాశం



అనంతపురం సెంట్రల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు కరువు పరిస్థితుల నుంచి గట్టెక్కించిన పట్టుపరిశ్రమ కొన్ని సంవత్సరాలుగా తిరోగమన బాటపట్టింది. వ్యవసాయ ఆధారిత ప్రాంతమైన ఉమ్మడి జిల్లాను తీవ్ర వర్షాభావం, కరవు తాండవం ఆవహించిన సమయంలో రైతులను ఆదుకుని సిరులు కురిపించింది. తక్కువ నీటి వాడకం, కొద్దిపాటి పెట్టుబడితో ఎక్కువ దిగుబడిని అందించే ఏకైక వ్యవసాయం మల్బరీ పంటసాగు. రైతులను ప్రోత్సహించేలా మొక్కలు నాటే ప్రక్రియ నుంచి పట్టుగూళ్ల మార్కెట్‌లో అమ్మేవరకు దశలవారిగా ప్రభుత్వం రాయితీలను అందిస్తోంది. ఇంటిల్లిపాది శ్రమిస్తే చాలు మూడు వారాల్లో పట్టుగూళ్ల రూపంలో మేలైన దిగుబడిని పొందవచ్చు. పట్టుపరిశ్రమ శాఖలో సరిపడా సిబ్బంది లేకపోవడంతో పరిస్థితి దినదిన గండంగా తయారైంది. వాతావరణ పరిస్థితులు, పంట తెగుళ్లు, పట్టుగూళ్ల తదితర వాటిపై అవగాహన కల్పించేవారు కరువయ్యారు. మరోవైపు ప్రభుత్వం అందించే ప్రోత్సాహాలను వివరించి, కొత్త రైతులను మల్బరీ సాగువైపు ఆకర్షించలేకపోతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రూ.కోట్లలో రాయితీలు బకాయి పడ్డాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 25వేల ఎకరాల్లో మల్బరీ పంటసాగవుతోంది. 70వేల ఎకరాల వరకు మల్బరీ సాగుచేయడానికి వాతావరణ పరిస్థితులు సహకరిస్తున్నాయి. శెట్టూరు, కుందుర్పి, కంబదూరు, రాయదుర్గం, కళ్యాణదుర్గం, మడకశిర, అమరాపురం, హిందూపురం, లేపాక్షి, కదిరి తదితర ప్రాంతాలన్నీ గతంలో సిరికల్చర్‌తో సిరులు కురిపించినవే. ప్రభుత్వాలు దృష్టి పెట్టకపోవడంతో గత కొన్నేళ్లుగా మల్బరీ సాగు బాగా తగ్గిపోయిందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

వెంటాడుతున్న సిబ్బందిలేమి

ఉమ్మడి జిల్లాలో అనంతపురం, కళ్యాణదుర్గం, పెనుకొండ, ధర్మవరం, హిందూపురం, కదిరి, మడకశిర ప్రాంతాలను పట్టుపరిశ్రమశాఖ డివిజన్లుగా విభజించింది. ఒక్కో డివిజన్ పరిధిలో అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ), సిరికల్చర్ ఆఫీసర్ (ఎస్ఓ), అసిస్టెంట్ సిరికల్చర్ ఆఫీసర్(ఏఎస్ఓ), టెక్నికల్ ఆఫీసర్ (టీఓ), టెక్నికల్ అసిస్టెంట్స్ (టీఏ), ఫీల్డ్ అసిస్టెంట్స్(ఎఫ్ఏ) ఉంటారు. మొత్తం ఏడు డివిజన్లకు గాను అన్ని క్యాడర్లు కలిపి 300 మంది కూడాలేరు. యూనిట్ల సంఖ్యను బట్టి ఒక్కో డివిజన్‌కు కనీసం 300 మంది ఉండాలని అధికార వర్గాలు చెబుతున్నాయి. సిబ్బంది కొరత నేపథ్యంలో కనీసం 30వేల ఎకరాల్లో కూడా మల్బరీ సాగు చేయించలేకపోతున్నట్లు తెలుస్తోంది. గ్రామ, వార్డు సచివాలయాల పోస్టుల భర్తీకోసం నిర్వహించిన సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా 450 మంది విలేజ్ సెరికల్చర్ అసిస్టెంట్స్ (వీఎస్ఏ)ను నియమించారు. వీరిలో ఉమ్మడి జిల్లాలోనే 150 మంది వీఎస్ఏలున్నారు. వీరందరూ రైతుసేవా కేంద్రాల ద్వారా అగ్రికల్చర్, హార్టికల్చర్ శాఖలకు సేవలందిస్తున్నారు. సిరికల్చర్‌లో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీలు చేసిన వీఎస్ఏలను ఇతర శాఖల్లో పనిచేయించడం ద్వారా పట్టుపరిశ్రమశాఖ నష్టపోతుందని ఆ శాఖ అధికారుల వర్గాలు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. వీఎస్ఏలను తీసుకుంటే ఆశించిన స్థాయిలో మల్బరీ సాగు పెంచవచ్చని ఆ శాఖ వర్గాలు అంటున్నాయి.

ప్రోత్సహిస్తే పూర్వవైభవం

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పట్టుపరిశ్రమ శాఖ పూర్తిగా నిర్వీర్యమైపోయింది. రైతులకు రావాల్సిన సబ్సీడీలు రూ.కోట్లలో బకాయి ఉంది. కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తే మల్బరీ సాగు పుంజుకుంటుందని ఆ శాఖ వర్గాలు అంటున్నాయి. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు డ్రిప్ ఇరిగేషన్‌కు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. 90శాతం వరకు సబ్సిడిని అందించి విరివిగా డ్రిప్ ప్రక్రియను వినియోగంలోకి తీసుకువచ్చారు. ఇది మల్బరీ సాగు పెరగడానికి బాగా ఉపయోగపడింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుని రైతులకు రాయితీలు ఇస్తే సాగు పెరిగి పూర్వవైభవం వస్తుందని ఆ శాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు. వీఎస్ఏలను పట్టుపరిశ్రమ శాఖకు అనుసంధానం చేసుకుని క్షేత్రస్థాయిలో విధులు కేటాయించాలని అధికార వర్గాలు సూచిస్తున్నాయి.

ప్రభుత్వం చేతుల్లో ఉంది...



వీఎస్ఏలను పట్టుపరిశ్రమ శాఖలోకి తీసుకునే అంశం ప్రభుత్వం చేతుల్లో ఉంది. ఉమ్మడి జిల్లాలో మల్బరీ సాగుకు అనుకూలమైన వాతావరణం పుష్కలంగా ఉంది. మల్బరీ సాగును పెంచాలంటే క్షేత్రస్థాయిలో రైతుల వద్దకెళ్లి అవగాహన కల్పించాలి. అందుకు తగిన సిబ్బంది లేకపోవడంతో ఉన్న వారికే ఎక్కు ప్రాంతాన్ని కేటాయించి రైతుల వద్దకు పంపుతున్నాం. ఇప్పటికే 80 శాతం వరకు ఉద్యోగులు రిటైర్డ్ అయిపోయారు. ఈ సమస్యను అధిగమించాలంటే వీఎస్ఏలను తీసుకుని విధులు కేటాయిస్తే పట్టుపరిశ్రమకు పూర్వవైభవం తీసుకురావచ్చు.

- ఆంజనేయులు, పట్టుపరిశ్రమ శాఖ జిల్లా అధికారి

అసెంబ్లీలో ప్రస్తావించా



మల్బరీ సాగుకు రైతులు ముందుకు వస్తున్నారు. అవసరమైన సాంకేతిక సలహాలిచ్చేందుకు తగిన సిబ్బంది లేరని అధికారులు చెబుతున్నారు. పంటకు ఏ రోగం వచ్చింది, ఎందుకు వచ్చింది, సమస్య ఎక్కడుంది వంటి అంశాలపై సాంకేతిక పరంగా విశ్లేషణ చేయాలి. కూటమి ప్రభుత్వం రాయితీ మొత్తాలను పెంచింది. రేషం షెడ్డు నిర్మాణానికి ఎస్సీ, ఎస్టీలకు రూ.4.50 లక్షలు. ఇతర వర్గాలకు రూ.3.35 లక్షలకు రాయితీ మొత్తం పెరిగింది. మల్బరీ మొక్కలు నాటుకునేందుకు ఒక్కో యూనిట్‌కు ఎస్సీ, ఎస్టీలైతే రూ.23వేలు, ఇతరులైతే రూ.18వేలకు పెంచారు. ప్రభుత్వ ప్రోత్సహకాలను సమగ్రమంగా అమలు చేయాలంటే సరైన సిబ్బంది కావాలి. అదేవిధంగా గత ప్రభుత్వంలో చెల్లించాల్సిన బకాయి మొత్తాలను విడుదల చేయాలని అసెంబ్లీలో ప్రస్తావించాను.

-ఎంఎస్ రాజు, ఎమ్మెల్యే, మడకశిర

సోలార్ అక్రమాల అదానీని అరెస్టు చేయాలి

సీపీఐ నాయకుల డిమాండ్



ర్యాలీ చేస్తున్న సీపీఐ నాయకులు

అనంతపురం విద్య, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): సోలార్ విద్యుత్ కొనుగోలులో భారీగా అక్రమాలకు పాల్పడిన గౌతమ్ అదానీని వెంటనే అరెస్టు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోలార్ విద్యుత్ కొనుగోలు వ్యవహారంలో అక్రమాలపై అనంతపురంలోని క్లాక్‌టవర్ వద్ద సీపీఐ నాయకులు శుక్రవారం నిరసన తెలిపారు. క్లాక్‌టవర్ చుట్టూ ర్యాలీ చేశారు. అదానీకి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. తర్వాత అదానీ దిష్టిబొమ్మ దహనానికి యత్నించగా, పోలీసులు అడ్డుకున్నారు. దీంతో నాయకులు, పోలీసుల మధ్య పెనుగులాట జరిగింది. ఈ క్రమంలో దిష్టిబొమ్మ ధ్వంసమైంది. తర్వాత సీపీఐ నాయకులు.. అదానీ చిత్రపటాలను దహనం చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ మాట్లాడుతూ... అదానీకి ప్రధాని నరేంద్ర మోదీ బినామీగా వ్యవహరిస్తున్నారంటూ మండిపడ్డారు. సోలార్ విద్యుత్ కోసం ముడుపులు చెల్లించిన ఆయనను వెంటనే అరెస్టు చేయాలన్నారు. ఇప్పటికే అదానీ, ఆయన తమ్ముడు మరో 8 మందిపై కేసులు నమోదయ్యాయన్నారు. అంతర్జాతీయ స్థాయిలో భారతదేశం పరువు, ప్రతిష్టను అదానీ మంటగలిపారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి ప్రధాని నరేంద్రమోదీ నైతిక బాధ్యత వహించాల్సి ఉంటుందనీ, జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేసి విచారణ చేయాలని డిమాండ్ చేశారు.

విద్యార్థిపై దూసుకెళ్లిన ప్రైవేటు బస్సు



అఖిల్ (ఫైల్)

పెనుకొండ రూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పెనుకొండ నగర పంచాయతీ ఇస్లాపురం గ్రామ సమీపంలోని ఘనగిరి పాఠశాలకు చెందిన ప్రైవేటు బస్సు.. విద్యార్థి అఖిల్(13)పై దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్థులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు.. ఇస్లాపురం గ్రామానికి చెందిన నాగరాజు, రాధమ్మ దంపతుల కుమారుడైన అఖిల్ పెనుకొండలోని శాంతినికేతన్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం అఖిల్ ఇంటి నుంచి సైకిల్‌లో పాఠశాలకు బయలుదేరాడు. గ్రామ సమీపంలోని నాగప్ప కుంట వద్ద ముందు వెళ్తున్న ప్రైవేటు బస్సు ఎదురుగా వస్తున్న ట్యాంకర్‌కు సైడ్ ఇవ్వడానికి ఉన్నఫలంగా వెనక్కి వచ్చింది. వెనుకే సైకిల్‌పై ఉన్న అఖిల్‌పై దూసుకెళ్లింది. తీవ్రంగా గాయపడిన అఖిల్‌ను పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో బంధువులు, కుటుంబ సభ్యులు బోరున విలపించారు. నిబంధనల ప్రకారం ప్రైవేటు స్కూల్ బస్సుకు క్లీనర్ తప్పనిసరిగా ఉండాలి. క్లీనర్ లేకుండా డ్రైవర్ ఒక్కసారిగా వెనక్కు రావడంవల్లే ప్రమాదం జరిగినట్లు గ్రామస్థులు తెలిపారు. పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంకటేశ్వర్లు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



వెంకటేశ్ (ఫైల్)

ఉరవకొండ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆమిద్యాల గ్రామానికి చెందిన రైతు వెంకటేశ్ అప్పుల బాధ భరించలేక గురువారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. వెంకటేశ్ తనకున్న ఎనిమిదెకరాల పొలంలో పంటలు సాగుచేస్తుండేవాడు. గొర్రెలను సైతం పెంచుతుండేవాడు. పొలంలో మిరప, వేరుశనగ పంటలను సాగు చేశాడు. రెండేళ్లుగా సరైన దిగుబడి రాక నష్టం వాటిల్లింది. ఇది చాలదన్నట్లు ఇటీవల 20కిపైగా గొర్రెలు మృతిచెందాయి. అప్పులు రూ.10లక్షలకు చేరాయి. వాటిని ఎలా తీర్చాలోనని ఆవేదన చెందుతుండేవాడు. ఈ నేపథ్యంలోనే గురువారం అర్ధరాత్రి గొర్రెల దొడ్డిలో ఉరేసుకున్నాడు. భోజనం తీసుకెళ్లిన కుటుంబీకులు గమనించి, వెంటనే కిందకు దించి ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే రైతు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వెంకటేశ్‌కు భార్య గంగమ్మ, ఇద్దరు చొప్పున కుమార్తెలు, కుమారులు ఉన్నారు. ఆత్మహత్యపై పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహానికి పోస్టుమార్టంకి తరలించారు.

విద్యుత్ కుంభకోణంలో జగన్‌పై కేసుపెట్టాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్



మాట్లాడుతున్న జగదీశ్

గుంతకల్లు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): అధిక ధరలతో విద్యుత్ కొనుగోలు, ఆదానీ నుంచి లంచాలు తీసుకున్న నేరానికి మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిపై కేసుపెట్టాలని, అరెస్టు చేసి జైలుకు పంపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డి. జగదీశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదానీ కంపెనీ నుంచి 3 వేల మెగావాట్ల విద్యుత్ కొనుగోలు వ్యవహారంలో జగన్మోహన్‌రెడ్డి అక్రమాలకు పాల్పడ్డారంటూ గతంలోనే పత్రికలు కథనాలను ప్రచురించాయన్నారు. ఇప్పుడు ఆ విషయాన్ని ధ్రువీకరిస్తూ ఆదానీ, జగన్మోహన్ రెడ్డితోపాటు ఎనిమిది మందిపై అమెరికా దర్యాప్తు సంస్థలు కేసులు నమోదుచేశాయన్నారు. ఆదానీ ద్వారా గుజరాత్ రాష్ట్రం కొన్న ధర కంటే అధికంగా ఏపీలో అప్పటి ముఖ్యమంత్రి జగన్ ఒప్పందం కుదుర్చుకున్నారని, అందుకు రూ. 1,750 కోట్ల లంచం తీసుకున్న అభియోగాలు నమోదయ్యాయన్నారు. స్మార్ట్ మీటర్ల కొనుగోలులోనూ ఇదే తరహా అక్రమం జరిగిందని ఆరోపించారు. ఈ ఆర్థిక నేరంపై జగన్‌పై కేసు నమోదుచేసి, అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో సీపీఐ నాయకులు బి. గోవిందు, గోపీనాథ్, మహమ్మద్ గౌస్, బి. మహేశ్, రాము, రామాంజనేయులు పాల్గొన్నారు.

హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై హర్షం

చంద్రబాబు చిత్రపటానికి న్యాయవాదుల క్షీరాభిషేకం



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న న్యాయవాదులు

హిందూపురం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు ఆమోదం తెలపడంతో పురం న్యాయవాదులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి శుక్రవారం స్థానిక కోర్టు ఆవరణలో క్షీరాభిషేకం చేశారు. అనంతరం న్యాయవాదులు మాట్లాడుతూ.. 2019 ఎన్నికల సమయంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారన్నారు. తర్వాత వైసీపీ అధికారంలోకి రావడంతో అది నెరవేరలేదన్నారు. యువనేత నారా లోకేశ్ యువగళం పాదయాత్ర సందర్భంగా కూటమి అధికారంలోకి వస్తే బెంచ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. దానిని నెరవేరుస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయడం అభినందనీయమన్నారు. కూటమి ప్రభుత్వం.. రాయలసీమపై కరుణ చూపిందన్నారు. టీడీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు శివశంకర్ మాట్లాడుతూ.. హైకోర్టు బెంచ్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. లోకాయుక్త, మానవ హక్కుల న్యాయస్థానాలను కర్నూలు నుంచి తరలించేది లేదని సీఎం చెప్పడం ఈ ప్రాంత న్యాయవాదులకు ఎంతో లబ్ధి చేకూరుస్తుందన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు న్యాయవాదులు రుణపడి ఉంటారన్నారు. కార్యక్రమంలో పురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, న్యాయవాదులు సుదర్శన్, సిద్దు, నాగేంద్ర, మనోహర్‌రెడ్డి, నాగరాజారెడ్డి, కోదండరామారావు, అభిషేక్, రకీబ్, వెంకటేశ్, ఈశ్వర్ పాల్గొన్నారు.

న్యూస్‌బాక్స్

జాతీయస్థాయి పోటీలకు మయాంక్



అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): హాకీ జాతీయ ఎస్‌జీఎఫ్-19 పోటీలకు జిల్లాకు చెందిన మయాంక్ ఎం పికయ్యాడు. ఇటీవల కాకినాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో సత్తా చాటిన మయాంక్ జాతీయ పోటీలకు అర్హత సాధించాడు. డిసెంబరు మొదటి వారంలో రాంచీలో నిర్వహించే పోటీలకు ఏపీ రాష్ట్ర జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఎస్‌జీఎఫ్-19 జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ అభినందించారు.

చీనీ టన్ను రూ.38వేలు

అనంతపురంరూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీ కాయలు టన్ను గరిష్ఠంగా రూ.38,650, కనిష్ఠంగా రూ.13వేలు, సరాసరి రూ.32,800తో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 85 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

టమోటా కిలో రూ.26

అనంతపురంరూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.26తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. శుక్రవారం మార్కెట్‌కు 825 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.20, కనిష్ఠ ధర రూ.13 పలికినట్లు ఆయన తెలిపారు.

నేడు, రేపు ఓటరు నమోదు

అనంతపురం టౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా శని, ఆదివారాలలో ఓటరు నమోదుకు ప్రత్యేకంగా దరకాస్తులు స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 8 నియోజకవర్గాలలో కలిపి 20,20,441 మంది ఓటర్లు ఉన్నారని అన్నారు. గతనెల 29న ముసాయిదా ఓటర్ల జాబితాను ఇచ్చామన్నారు. అందులో ఓటరుగా అర్హత ఉండి జాబితాలో లేనివారు, 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్ల నిండుతున్నవారు ఈనెల 28 వరకు ఓటరుగా నమోదుచేసుకోవచ్చన్నారు. ఓటు నమోదు కోసం ప్రత్యేకంగా పోలింగ్ బూత్‌లలో దరకాస్తులు స్వీకరిస్తామన్నారు.

రేపటి నుంచి ఉద్యోగుల క్రికెట్ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఏపీ వెటరన్ క్రికెట్ అసోసియేషన్, ఏపీ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ట్రస్టు సంయుక్తంగా ఆర్డీటీ స్టేడియంలో ఈనెల 24 నుంచి ఉమ్మడి జిల్లా స్థాయిలో ప్రభుత్వ ఉద్యోగుల క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు మచ్చా రామలింగారెడ్డి తెలిపారు. ఉద్యోగుల క్రికెట్ పోటీలకు సంబంధించిన పోస్టర్లు శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో డీఆర్వో మలోలా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామలింగారెడ్డి మాట్లాడుతూ సెలవు దినాల్లో మాత్రమే పోటీలు ఉంటాయన్నారు. పోటీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్లు 9490062555, 7386958666ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో నిర్వాహణ కమిటీ సభ్యులు విజయరామరాజు, సతీష్, మారుతి, శ్రీకాంత్, నరేష్ పాల్గొన్నారు.

జిల్లాలో 203 నీటి కుంటల నిర్మాణం

- డ్వామా పీడీ సలీం బాషా


ఉరవకొండ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 203 నీటి సంరక్షణ కుంటల నిర్మాణాలు చేపడుతున్నట్లు డ్వామా పీడీ సలీంబాషా పేర్కొన్నారు. పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో చేపడుతున్న నీటి కుంటల నిర్మాణ పనులను పీడీ శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భవనాల నుంచి వచ్చే వర్షపు నీటిని నీటి కుంటలో ఇంకడం వల్ల భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. అందుకోసం జిల్లాలో ఇప్పటికే 180 నీటి సంరక్షణ నిర్మాణ పనులు పూర్తి అయ్యాయని తెలిపారు. ప్రధానంగా ప్రభుత్వ విద్యాసంస్థలు, కార్యాలయాల్లో వీటి నిర్మాణాలకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. గ్రామాల్లో త్వరలోనే ఉపాధి హామీ పనులు చేపడతామన్నారు. ఉపాధి హామీ పనుల్లో అక్రమాలకు పాల్పడిన వారిపై ఆర్ఆర్ యాక్టు కేసు నమోదు చేస్తామన్నారు. సామాజిక తనిఖీలలో రికవరీల కోసం నోటీసులు ఇస్తామని తెలిపారు. సమావేశంలో ఏపీడీ శైలజ, ఎంపీడీవో రవిప్రసాద్, ఏపీవో విమల, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.



నీటి కుంటను పరిశీలిస్తున్న పీడీ సలీం బాషా

టీడీపీతోనే అందరికీ రాజకీయ చైతన్యం

- ఆర్టీసీ కడప జోనల్ చైర్మన్ పూల నాగరాజు



బాధ్యతలు చేపడుతున్న పూల నాగరాజు

అనంతపురం కల్చరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): సమాజంలోని అన్ని సామాజిక వర్గాలకు రాజకీయ చైతన్యం కల్పించడం టీడీపీతోనే సాధ్యమని ఏపీఎస్ ఆర్టీసీ కడప జోనల్ చైర్మన్ పూల నాగరాజు పేర్కొన్నారు. కడప జోనల్ చైర్మన్‌గా నియమితుడైన పూలనాగరాజు శుక్రవారం అనంతపురం బస్టాండుపై గల తన కార్యాలయం వద్ద ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఆర్టీసీ ఈడీ చంద్రశేఖర్ సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో పూల నాగరాజు మాట్లాడుతూ... బడుగు, బలహీన వర్గాలను సైతం అందలమెక్కించే దిశగా టీడీపీ కూటమి పాలన సాగిస్తోందన్నారు. జోనల్ పరిధిలో ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపడంతోపాటు ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించేలా చర్యలు చేపడతామన్నారు. ఆర్టీసీ సిబ్బందితోపాటు ప్రయాణికులకు సైతం అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. అనంతరం ఆర్టీసీ సిబ్బందితోపాటు టీడీపీ నాయకులు పెద్దఎత్తున బస్టాండుకు చేరుకుని పూల నాగరాజుకు పుష్పగుచ్చాలు, శాలువాలతో అభినందించారు. కార్యక్రమంలో ఆర్టీసీ అనంతపురం రీజనల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆదోని, డీఎం నాగభూపాల్, మాజీ మేయర్ మదమంచి స్వరూప, జితేంద్రగౌడ్, వేణుగోపాల్, కృష్ణంరఘు, ఆర్టీసీ ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

యాంటీబయాటిక్ ప్రమాదకరం

డాక్టర్ల సలహా మేరకే మందులు వాడాలి

సూపరింటెండెంట్, ప్రిన్సిపాల్ సూచన



ర్యాలీ నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్, డాక్టర్లు, మెడికోలు

అనంతపురం టౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): అధికంగా యాంటీ బయాటిక్ మందులువాడకం ప్రమాదకరమని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు సూచించారు. ప్రపంచ ఔషధ నిరోధక అవగాహన కార్యక్రమాలలో భాగంగా శుక్రవారం మెడికోల ఎస్ఎస్ఎస్ యూనిట్, మైక్రో బయోలజీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కళాశాలలో ఏర్పాటు చేసిన సదస్సులో సూపరింటెండెంట్, ప్రిన్సిపాల్ మాట్లాడుతూ యాంటీబయాటిక్‌మందులు అనవసరంగా వాడరాదన్నారు. అధికంగా వాడకంవల్ల శరీరంలో ఉండే బ్యాక్టీరియాలు చనిపోయి జీర్ణకోశ, పెద్దపేగు, చిన్నపేగు సమస్యలు ఉత్పన్నమవుతాయని తెలిపారు. సొంతవైద్యంతో మాత్రలు వాడడం మరింత ప్రమాదకరమని, డాక్టర్ల సలహామేరకే తగిన మోతాదులో వాడాలని సూచించారు. కార్యక్రమంలో మైక్రో బయాలజీ విభాగాధిపతి డాక్టర్ శాంతిరెడ్డి, మెడికల్ కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ షారోన్‌సోనియా, సీనియర్ వైద్యులు హైమావతి, ఉమాదేవి, ప్రవీణ, ప్రియాంక, ఆశాలత, పద్మశ్రావణి, ఎస్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ పరదేశీనాయుడు పాల్గొన్నారు.

కణేకల్లు యువకుడికి పురస్కారం



సర్మాస్‌కు అవార్డును ప్రదానం చేస్తున్న జాయింట్ డైరెక్టర్

కణేకల్లు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన మణేగార్ సర్మాస్‌వలి అనే యువకుడికి కర్ణాటక రాష్ట్రంలో అరుదైన పురస్కారం లభించింది. వ్యవసాయ, పునరుత్పత్తి రంగాల్లో విశిష్ట సేవలకు గాను కర్ణాటక ప్రభుత్వ ఎలక్ట్రానిక్, ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ జాయింట్ డైరెక్టర్ బాలకృష్ణ సర్మాస్‌వలికి అప్రిసియేషన్ అవార్డును అందజేశారు. శుక్రవారం బెంగుళూరులోని చాణక్య ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో సర్మాస్‌వలికి సత్కరించి ఈ అవార్డును ప్రదానం చేశారు. సర్వోన్నత ఉపగ్రహ పేలోడ్ టెక్నాలజీ సహాయంతో వ్యవసాయంలో పంట ఉత్పత్తి అంచనాలను సులభతరం చేయడం, సౌరశక్తి సామర్థ్యాన్ని మెరుగు పరచడంలో సర్మాస్‌వలి ఓ ప్రాజెక్టును రూపొందించారు. అది అక్కడి ప్రభుత్వానికి ఉపయోగకరంగా ఉండడంతో ఈ అవార్డును అందజేశారు. కణేకల్లుకు చెందిన సర్మాస్‌వలి బెంగుళూరులో ఇలాంటి ప్రయోగాలు చేసి అవార్డులు అందుకోవడం అభినందనీయమని పలువురు కొనియాడారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో సత్తా



ట్రోఫీతో జశ్వంత్

గుత్తిరూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని సేవాఘడ్ గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థి జశ్వంత్ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో రెండో స్థానం సాధించాడు. ఈ నెల 19 నుంచి 21 వరకు మచిలీపట్నంలో రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గొందిపల్లికి చెందిన జశ్వంత్ రెండో స్థానం సాధించాడు. సేవాఘడ్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. పీఈటీ విజయకుమార్‌నాయక్‌తో కలిసి శుక్రవారం సేవాఘడ్‌కు వచ్చాడు. పాఠశాల ప్రిన్సిపాల్ ఫయాజ్, కోచ్ పెద్దక్క, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జశ్వంత్‌ను అభినందించారు.

ఆర్అండ్బీ స్థలంలో షెడ్ల తొలగింపునకు యత్నం



ఆర్అండ్బీ స్థలంలో వేసిన రేకుల షెడ్లు

పెనుకొండ టౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి) :మండలంలోని తిమ్మాపురం వద్ద ఆర్అండ్బి స్థలంలో అనధికారికంగా వేసిన షెడ్లను తొలగించేందుకు ఆర్అండ్బి అధికారులు సంసిద్ధమయ్యారు. ఈ విషయం తెలుసుకున్న నగర పంచాయతీ కౌన్సిలర్లు అక్కడకు చేరుకుని వారిని అడ్డుకున్నారు. నగర పంచాయతీకి చెందిన 20మంది సభ్యుల్లో దాదాపు 15మంది వరకు ఆర్అండ్బి స్థలంలో అనధికారికంగా షెడ్లువేసి అద్దెలకు ఇచ్చుకునేందుకు ఏర్పాటు చేశారు. ప్రభుత్వం మారడంతో వాహన రాకపోకలకు ఇబ్బందిగా ఉందని వాటిని తొలగించాలని ఆర్అండ్బి అధికారులు సిద్ధమయ్యారు. తమకు నోటీసులు ఇచ్చి షెడ్లు తొలగించాలని కౌన్సిలర్లు పేర్కొన్నారు. ఉన్నతాధికారులతో ఆలోచించి నిర్ణయం తీసుకుంటామని ఆర్అండ్బి అధికారులు తెలిపారు.

కేశవయ్యకు సన్మానం

పెనుకొండ టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన యాదవ కార్పొరేషన్లో డైరెక్టర్గా ఎంపికైన కేశవయ్యను కులస్థులు సన్మానించారు. శుక్రవారం పట్టణంలోని ఆయన స్వగృహంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి పూలమాలలువేసి శాలువ కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య మాట్లాడుతూ కార్పొరేషన్ కేటాయించే నిధుల్లో సద్వినియోగం చేస్తామని యాదవ కుల సంక్షేమానికి పాటుపడతామన్నారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ ఖాతాకు ఎన్పీసీఐ లింక్ చేసుకోవాలి

అగళి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ బ్యాంక్ అకౌంట్ ఖాతాకు ఎన్పీసీఐ అనుసంధానం చేసుకోవాలని ఎంపీడీఓ యాదవేంద్ర తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పతకాలు అందాలంటే ప్రతి ఒక్కరూ బ్యాంక్ ఖాతాకు ఎన్పీసీఐ అనుసంధానం చేసుకోవాలన్నారు. నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఈ లింకును బ్యాంక్తో పాటు పోస్టాఫీస్ సచివాలయ సిబ్బంది దగ్గర వెళ్లి తప్పకుండా బ్యాంక్ ఖాతాకు ఎన్పీసీఐ అనుసంధానం చేసుకోవాలన్నారు. ఈ లింక్ చేసుకుంటేనే ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు డబ్బులు పడతాయన్నారు. ఈ అనుసందానానికి ఆధార్ జెరాక్స్ తీసుకొని వెళ్లాలని ఎంపీడీఓ తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

అగళి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వమే విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ యాదవేంద్ర పేర్కొన్నారు. అగళి మండల కేంద్రంలోని గుప్త కళాశాలలో శుక్రవారం ఆధార్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఒకటవ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు ఆధార్ కార్డులో పొరపాట్లు ఉన్నా సరిచేసుకోవాలన్నారు. పొరపాటుతో సరిచేసుకోకపోతే భవిష్యత్తులో ఇబ్బందులు కలుగుతాయని ఎంపీడీఓ తెలిపారు. ఇందులో భాగంగానే ప్రభుత్వం విద్యార్థుల దగ్గరే ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండల రీసోర్స్ కోఆర్డినేటర్ వెంకటేశ్, బాబు, కళాశాల ప్రిన్సిపాల్ రఘురాం, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు సత్యసాయి జయంత్యుత్సవం

హిందూపురం అర్బన్, నవంబరు 22 ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని పాండురంగ నగర్లో ఉన్న శ్రీ సత్యసాయి సేవాసదన్లో సత్యసాయి జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు సాయిసదన్ కన్వీనర్ శ్రీకాంత్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఉదయం నుంచే వివిధ పూజలు ఆరాధనలు నిర్వహించనున్నారు. అదే విధంగా మహిళలచే సహస్ర సాయినామార్చన, నారాయణసేవ, నగరోత్సవం, దీపారాధన తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

సరుకుల వితరణ

హిందూపురం అర్బన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కిరికెర టీబీ యూనిట్లో కేర్ స్వచ్ఛంద సంస్థ టిబి రోగులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేసింది. శనివారం టీబీకేర్ యూనిట్లోని 30 మందికి ఒక్కొక్కరికి 10 కేజీల ఆర్గానిక్ బియ్యం అందించారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసి, ఎయిడ్స్ అండ్ టిబి అధికారి డా. తిప్పయ్య పాల్గొని క్షయ వాధి గ్రస్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. పిపిఎం నాగేంద్ర, కేర్ ఎన్జీఓ కో ఆర్డినేటర్, వెంకటేష్, ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్లత, సూపర్వైజర్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న సీఐ శేఖర్

గోరంట్ల, నవంబరు22 (ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి శ్రీసత్యసాయిబాబా 99వ జయంతి సందర్భంగా గోరంట్లలో 60మంది వృద్ధులు, వికలాంగులకు సీఐ శేఖర్ శుక్రవారం దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మానవ జన్మ చాల పవిత్రమైనదని, ప్రతిఒక్కరు తోటి మనిషికి చేతనైన విధంగా సాయం చేయాలని కోరారు. రెడ్క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుడు జగదీశ్వర్ వికలాంగులకు అన్నదానం చేశారు. ఈకార్యక్రమంలో దాతలు రాఘవేంద్రరెడ్డి, క్రిష్ణారెడ్డి, జీఎం సురేష్, గ్రంథాలయ అధికారి రమేష్నాయక్, కమిటీ సభ్యులు శ్రీనివాస గుప్తా, ఆదినారాయణ తదితరులున్నారు.

నేడు, రేపు ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులు

గోరంట్ల, నవంబరు22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటర్లు జాబితాలో చేర్పులు, మార్పులకోసం శని, ఆదివారాల్లో అవకాశం కల్పించినట్లు తహసీల్దార్ మారుతి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద బిఎల్ఓలు అందుబాటులో ఉంటారన్నారు. 2025 జనవరి 1నాటికి18 యేళ్లు పూర్తి అయిన ప్రతిఒక్కరు ఓటర్లుగా నమోదు చేయించుకోవాలని, మార్పులు, చేర్పులు, తొలగింపులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

హలో.. హలో..
నో రెస్పాన్స్!



● విద్యుత్ కోతలతో పనిచేయని సెల్ఫోన్ నెట్వర్క్ ● ఇబ్బంది పడుతున్న వినియోగదారులు

మడకశిర రూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లుమర్రి పంచాయితీ కేంద్రంలో ఉన్న మొబైల్ ఫోన్లు హలో! హలో! అని మాట్లాడుతుండాగానే మూగబోతున్నాయి. విద్యుత్ కోత కారణంగా సెల్ టవర్స్ పనిచేయకపోవడమే ఈ సమస్యకు కారణమని తెలుస్తోంది. తరచూ సెల్ సిగ్నల్స్ అందకపోవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతంలో బీఎస్ఎన్ఎల్ కనెక్షన్లు అధికంగా ఉన్నాయి. పంచాయితీ కేంద్రంలో స్టేట్బ్యాంక్, తపాలకార్యాలయం, గ్రామ సచివాలయం, ప్రాథమిక ఆరోగ్యకేంద్రంతో పాటు ప్రభుత్వ కార్యాలయాలన్నీ బీఎస్ఎన్ఎల్ నెట్ వర్కుతోనే పనిచేస్తున్నాయి. తరచూ విద్యుత్ కోతతో సెల్ఫోన్ నెట్వర్కు పనిచేయడంలేదు. దీంతో కార్యాలయాలలో పనులు స్తంభించిపోతున్నాయి. అంతేకాకుండా ఎక్కువగా గ్రామీణ ప్రజలకు సెల్ కనెక్షన్లు ఉన్నాయి. తరచు విద్యుత్ కోత విషయాన్ని విద్యుత్ ఏఈ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించలేదని గ్రామస్థులు వాపోతున్నారు. వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు తగుచర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

విద్యుత్ కోతలతోనే ఇబ్బందులు పడుతున్నాం

తరచు విద్యుత్ కోతతోనే అనేక ఇబ్బందులు పడుతున్నాం.అధికారులు దృష్టికి తీసుకెళితే సరియైన సమాధానం ఇవ్వడంలేదు. రెండు రోజుల్లో సరిచేయకపోతే కల్లుమర్రి సబ్ స్టేషన్ ముందు గ్రామస్థులు ధర్నాచేస్తాం. అదే విధంగా బీఎస్ఎన్ఎల్ అధికారులు కూడావినియోగదారులకు నెట్ వర్కు సమస్యలు రాకుండా చూడాలని కోరుచున్నాం.

-నారాయణప్ప, రైతు, కల్లుమర్రి

విద్యుత్ సమస్య వల్లే..

సరఫరా సమయంలో కూడా కోతలు ఉండడంతో అక్కడ ఉన్న నెట్వర్కులో సమస్యలు ఏర్పడుతున్నాయి. ఈ విషయం విద్యుత్ ఏఈ దృష్టికికూడా తీసుకెళ్లాం. విద్యుత్ కోత కారణంగా యూపీఎస్ డౌన్ అవుతోంది. దీంతో నెట్ వర్కు సమస్యలు ఏర్పడుతున్నాయి.

-మహబూబ్బాషా, బీఎస్ఎన్ఎల్ అధికారి మడకశిర

తాగని పాలకు బిల్లులు

● పీడీ కార్యాలయానికి బిల్లును పంపిన సీడీపీఓ

● కాంట్రాక్టరు, ట్రాన్స్పోర్టర్ జేబుల్లోకి డబ్బు

హిందూపురం అర్బన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భవతులు, బాలింతలకు పాలు సరఫరా చేయకుండానే బిల్లులు చేసుకొని కాంట్రాక్టర్లు, ట్రాన్స్పోర్టర్లు జేబులు నింపుకుంటున్నారు. గత మూడు నెలలుగా అంగన్వాడీ సెంటర్లకు పాలలో కోత విధించినప్పటికీ సెప్టెంబరు నెలకు సంబంధించి పాల బిల్లును పాస్ చేసినట్లు తెలుస్తోంది. ప్రతి సెంటర్కు ఒక బాక్సు ప్రకారం అంటే 10 లీటర్ల పాలు మూడు నెలల నుంచి కోత విధించి ఇస్తున్నారు. అయినప్పటికీ పూర్తి స్థాయిలో పాలు అందించామని కాంట్రాక్టర్లు, ట్రాన్స్పోర్టర్లు బిల్లు చేసుకున్నారు. ఇండెంట్ ప్రకారం కాకుండా కాంట్రాక్టర్ ఇష్టానుసారం పాల సరఫరా చేస్తున్నాడు. ఈ విషయమై సెంటర్ల కార్యకర్తలు సంబంధిత సూపర్వైజర్లకు తెలియజేశారు. సూపర్వైజర్లు సీడీపీఓకు సమాచారం అందించారు. అయినప్పటికి సీడీపీఓ పెడచెవిన పెట్టి బిల్లులు పూర్తి స్థాయిలో మంజూరయ్యేలా పిడి కార్యాలయానికి నివేదికలు పంపించారు. కింది స్థాయి అధికారులు పంపిన నివేదికల ప్రకారం పీడి కార్యాలయం బిల్లును ఓకే చేశారు. తెలిసి తెలిసి సీడీపీఓ ఎలా బిల్లును ఆమోదించారని ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. దీనిపై ఐసీడీఎస్ కార్యాలయ సిబ్బంది బహిరంగంగా మాట్లాడుకోవడం విశేషం.

అందించని పాలకు బిల్లులు పెట్టడంతో లక్షలాది రూపాయలు కాంట్రాక్టర్, ట్రాన్స్పోర్టర్ జేబులోకి వెళ్లాయని తెలుస్తోంది. ప్రజాధనం ఇలా వ్యర్థం అయిన విషయంపై ఆంధ్రజ్యోతిలో 'పాల రాక్షసులు' అనే శీర్షికతో కథనం కూడా వెలువడింది. ఈ విషయంపై శనివారం ఇన్చార్జి పీడీ వరలక్ష్మీ హిందూపురం కేంద్రంలో అంగన్వాడీ సెంటర్లను విజిట్ చేసి విచారణ చేపట్టనున్నారు. అయితే సూపర్వైజర్లు, సీడీపీఓలకు తెలిపిన తరువాతే తాము పాలల్లో కోత విధించామని కాంట్రాక్టరు, ట్రాన్స్పోర్టర్ చెప్పడం కొసమెరుపు. అంటే ఇందులో వారి వాటా కూడా ఉందని చెప్పకనే చెబుతున్నారు. సూపర్వైజర్లు, సీడీపీఓ వాటాల్లో తేడా రావడంతోనే ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకొని ఇంటి గుట్టు బయట పెట్టారని కార్యకర్తలు నవ్వుకుంటున్నారు. ఈ నేపథ్యంలో శనివారం పాల కోతపై విచారణ పారదర్శకంగా జరిగేనా అని అంగన్వాడీ సిబ్బంది చర్చించుకుంటున్నారు.

ఆటోడ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

● పట్టణంలో భారీ ర్యాలీ

పావగడ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్మిక శాఖ నుండి అందించే సౌకర్యాలు ప్రతి ఆటో డ్రైవర్ కుటుంబానికి చెందాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం పావగడలోని ఆటోడ్రైవర్ల సంఘం తరపున పెద్దఎత్తున ర్యాలీ చేపట్టారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రతాప్ మదుకరి మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు రాత్రింబవళ్లు ప్రజలకు 108 రీతిలో అందుబాటులో ఉండి ఎండా వానా అనక సేవలు అందిస్తున్నారని అటువంటి వారికి కార్మిక శాఖ నుండి ఎన్నో సౌకర్యాలు అందిస్తున్నప్పటికీ పావగడ అధికారులు ఆటో డ్రైవర్లను విస్మరించడం దారుణం అన్నారు. ప్రతి ఒక్క జయంతికి ముందస్తుసభను ఏర్పాటు చేస్తారని, ఆటో డ్రైవర్ల సమస్యలపై ఏ ఒక్క అధికారి కూడా స్పందించకపోవడం శోచనీయమన్నారు. అన్ని కులాల వారు ఆటో డ్రైవర్లుగా పనిచేస్తున్నారని, వారి అభివృద్ధికి కృషి చేయాలని వారి పిల్లల విద్యాభ్యాసానికి కూడా ప్రభుత్వం సహకరించాలని డిమాండ్ చేశారు. ఆటోడ్రైవర్ల సంఘం అధ్యక్షులు నాగరాజు, డ్రైవర్లు కలిసి వినతిపత్రాన్ని తహసీల్దార్కు అందజేశారు.



తహసీల్దార్కు వినతిపత్రం అందజేస్తున్న ఆటోడ్రైవర్లు

కంకర తేలిన గ్రామీణ రోడ్లు

పావగడ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఏడాది గడవక ముందే కొత్తగా వేసిన రోడ్లు కంకరతేలి ఆ రోడ్లలో పయనించాలంటేనే గ్రామీణులు ఇబ్బందిపడుతున్నారు. పళవల్లి నుంచి బి.కె.హళ్లి వరకు 14 కిలోమీటర్ల మట్టిరోడ్డుకు 2022లో ప్రజా పనుల శాఖ, నాబార్డు చెరో ఏడు కిలోమీటర్లు తారు రోడ్డు వేయడానికి రూపకల్పన చేశారు. పళవల్లి నుండి కేతగానచెర్లు క్రాసింగ్ వరకు ఏడు కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.5కోట్లు కేటాయించగా ఆరోడ్ల పనులను మధుగిరి కాంట్రాక్టర్, పావగడ కాంట్రాక్టర్ కలిసి పూర్తిచేశారు. ప్రజా పనుల శాఖ అధికారి కాంట్రాక్టర్లతో కుమ్మక్కై చవుడు భూమిని పరీక్ష చేయించకుండానే నాసిరకమైన పనులు చేపట్టారు. దీంతో రెండు సంవత్సరాలు గడవకుండానే కొత్తగా వేసిన రోడ్డుకు ఇరువైపులా కంకర తేలిందని భూపురు గ్రామానికి చెందిన మంజునాథరెడ్డి, కొత్తపల్లికి చెందిన రాజునాయక్ ఆరోపిస్తున్నారు. మరో ఏడు కిలోమీటర్ల నాబార్డు సంస్థ ఆధునిక యంత్రాలతో నిర్మించిన రోడ్డు నిర్మాణపరంగా నాణ్యంగా ఉంది. ఇలా ఏడాది గడవక ముందే రోడ్లు పాడవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని వారు వాపోయారు. ఈవిషయమై ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని రోడ్లు మరమ్మతు చేసేందుకు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.



కంకర తేలిన పళవల్లి, క్యాతగానచెర్లు క్రాసింగ్ రోడ్డు

మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన ర్యాలీ



మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

పరిగి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రధాన వీధులగుండా ర్యాలీ చేపట్టారు. అనంతరం మన మరుగుదొడ్లు, మన గౌరవం అంటూ నినాదాలు చేశారు. మండల కన్వీనర్ గోవిందరెడ్డి మాట్లాడుతూ పరిగి మండలాన్ని బహిరంగ మలమూత్రవిసర్జనలేని ప్రాంతంగా తీర్చిదిద్దాలని, మరుగుదొడ్లులేని ఇంటి యజమానులు మరుగుదొడ్ల నిర్మాణానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ లక్ష్మీదేవి, హెచ్ఎం కృపాసత్యరాజ్, పంచాయతీ కార్యదర్శి నారాయణ, నీటిపారుదలశాఖ అసిస్టెంట్ ప్రత్యూష, సర్పంచ్ లక్ష్మీదేవి, కోకన్వీనర్ మల్లికార్జున, ఉపాధ్యాయులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న పరిగి వేణుగోపాల్రావు

పరిగి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ గార్మెంట్స్లో కార్మికుడిగా పనిచేస్తూ మృతిచెందిన శివ కుటుంబానికి దివ్య ఎడ్యుకేషనల్ ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు పరిగి వేణుగోపాల్రావు ఆర్థిక సాయం అందించారు. ఈయన హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని మృతుని కుటుంబాన్ని పరామర్శించి అనంతరం దహనసంస్కారాలకు తనవంతు సాయంగా రూ.5వేలు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చంద్రశేఖర్రెడ్డి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.


25న కార్తీక లక్ష దీపోత్సవం

గోరంట్ల, నవంబరు22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూడిద గడ్డపల్లి శ్రీషిర్డిసాయిబాబా ఆలయంలో ఈనెల 25న లక్షదీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అర్చకులు నారాయణానంద స్వామి శుక్రవారం ఓప్రకటనలో తెలిపారు. ఆలయ వ్యవస్థాపకులు సాయిప్రసాద్, సేవా సమితి సభ్యుల ఆధ్వర్యంలో కార్తీక మాసం చివరి సోమవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. సాయంత్రం 6గంటలనుంచి 9 గంటలవరకు జరిగే కార్యక్రమంలో భక్తులు పాల్గొని దీపాలు వెలిగించాలని కోరారు.

యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

పెనుకొండ రూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి) : రొద్దం మండల ప్రాథమిక పాఠశాలలో యూటీఎఫ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా కార్యదర్శి నరేష్కుమార్ తెలిపారు. గౌరవాధ్యక్షునిగా టి. రమేష్, అధ్యక్షులుగా సానిపల్లి గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా కె. మారుతి, ఉపాధ్యక్షులుగా నాగార్జున రెడ్డి, ముత్యాలప్ప, కోశాధికారిగా నరేష్, సీపీఎస్ కమిటీ కన్వీనర్గాశేషాద్రిని ఎన్నుకున్నట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు



మాట్లాడుతున్న తహసీల్దార్

రొళ్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రొళ్ల మండలంలోని హొట్టేబెట్ట గ్రామ సచివాలయంలో ప్రజా సమస్యల పరిష్కారవేదిక రెవిన్యూ సదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ షెక్షావలి మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ఉన్న భూ సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రెవిన్యూ సదస్సులు ఏర్పాటు చేసిందన్నారు. కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఇబ్బందులు పడేవారికి సేవలందించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు సమస్యలను అర్జీ రూపంలో అందిస్తే పరిష్కరిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర వక్కలిగ కన్వీనర్ వి.ఎం.పాండురంగప్ప, పార్లమెంటు కార్యదర్శి రవి భూషణ్, మండల కన్వీనర్ దాసిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఈరన్న, ఏపీఓ ఓబుళప్ప పాల్గొన్నారు.

హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై హర్షం



రాధాకృష్ణ

మడకశిరటౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి):కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుచేయడంతో రాయలసీమవాసులు, న్యాయవాదుల కల నెరవేరినట్లయిందని టీడీపీ లీగల్సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. ఎంతో చారిత్రాత్మకమైన తీర్మానాన్ని శాసనసభలో ప్రవేశపెట్టడం సంతోషదాయకమన్నారు. హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు కృషిచేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్కల్యాణ్కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా మడకశిర పారిశ్రామికవాడలో అతిపెద్ద కేంద్ర ప్రభుత్వ పరిశ్రమను మంజూరు చేసేందుకు కృషిచేసిన ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

విగ్రహ తయారీ బాధ్యత అరుణ్యోగిరాజ్కు



శిల్పిని కలిసిన ఆలయ కమిటీ సభ్యులు

హిందూపురం అర్బన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణ నడిబొడ్డున గాంధీ సర్కిల్లో నూతనంగా నిర్మింప తలపెట్టిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో నరసింహస్వామి విగ్రహం తయారు చేసే బాధ్యతను ప్రముఖశిల్పి అరుణ్యోగిరాజ్కు అప్పగించినట్లు ఆలయ కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రపంచ దేశాలు గర్వించే విధంగా అయోధ్య బాలరాముని విగ్రహాన్ని తయారు చేసిన శిల్పి అరుణ్ యోగిరాజ్ అన్నారు. ఆయన వల్లనే బాలరాముని విగ్రహం సహజ సుందరంగా తయారైందని అన్నారు. ఆయనను ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం మైసూర్లో కలిశారు. బాలరాముని సుందర రూపాన్ని చెక్కిన విధంగా హిందూపురం నరసింహస్వామి దివ్య మంగళమూర్తి విగ్రహాన్ని రూపుదిద్దాలని ఆయనను కోరామన్నారు. ఈమేరకు విగ్రహ ఏర్పాట్ల బాధ్యత ఆయనకు అప్పగించామన్నారు. త్వరలో ఆయన తన బాధ్యతను పూర్తి చేస్తారన్నారు. ఆయనను కలిసిన ఆలయ కమిటీ సభ్యులలో జెఇ వెంకటస్వామి, రాఘవేంద్ర, నిమ్మకాయల రాము, రఘునాథ్, సుధాకర్, నెట్టెప్ప, సూర్యనారాయాణ, నవీన్, నారాయణ, మైసూరు దినేష్ తదితరులు ఉన్నారు.

షార్ట్ సర్క్యూట్తో పత్తి దగ్ధం



మల్బరీ షెడ్డులో కాలిపోయిన పత్తి, పరికరాలు

గుడిబండ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళికెర గ్రామానికి చెందిన సురేంద్ర ఇటీవల పండించిన పత్తి విద్యుత్ షార్ట్ సర్క్యూట్తో దగ్ధం అయిందని రూ25లక్షలు నష్టం వాటిల్లినట్లు తహసీల్దార్కు వినతిపత్రం సమర్పించాడు. ప్రమాదంలో మల్బరీ షెడ్డు కూడా దెబ్బతిందని ఆవేదన వ్యక్తంచేశాడు. అప్పులు చేసి పత్తిపంట, మల్బరీ షెడ్డు నిర్మించామని, ఉన్నట్టుండి విద్యుత్ షార్ట్ సర్క్యూట్తో తీవ్రంగా నష్టపోయామని తెలిపారు. ఈవిషయాన్ని గుడిబండ డిప్యూటీ తహసీల్దార్ కల్యాణ్ చక్రవర్తికి విన్నవించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపోయిన తనకు పరిహారం అందించి ఆదుకోవాలని అధికారులను కోరారు.

రబీ విత్తన వేరుశనగ పంపిణీ ప్రారంభం

అమరాపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అమరాపురం మండల కేంద్రంలోని శుక్రవారం రబీ 2024 సంవత్సరానికి సంబంధించిన విత్తన వేరుశనగ పంపిణీ ప్రారంభించారు. ఈసందర్భంగా మండల వ్యవసాయ అధికారి మంజునాథ్ మాట్లాడుతూ అమరాపురం మండలానికి 350 క్వింటాళ్ల వేరుశనగ వచ్చిందన్నారు. శుక్రవారం ఉదయం 22 క్వింటాళ్ల వేరుశనగను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. మండలంలోని విత్తన వేరుశనగ సాగు చేసుకొనే రైతులు బోరు బావుల కింద సాగుచేసుకోవడానికి రైతులకు వేరుశనగను అందిస్తున్నామని ఆయన తెలిపారు. ఒకబస్తా వేరుశనగ ధర రూ.1728 ఉంటుందని, ఒక రైతుకు గరిష్ఠంగా మూడు బస్తాలు ఇస్తామన్నారు. ఈకార్యక్రమంలో మండల కన్వీనర్ గణేష్, మాజీ జడ్పీటీసీ నరసింహమూర్తి, మాజీ ఎంపీపీ మద్దనకుంట రఘు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

మడకశిరటౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం పురస్కరించుకొని పట్టణంలోని పలు దేవాలయాల్లో విశేష పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం పట్టణంలోని పడుసులమ్మ, గంగాభవాని, కొల్లాపురమ్మ, కన్యకాపరమేశ్వరీ ఆలయాలతో పాటు మారుతీనగర్లో వెలిసిన అభయ ఆంజనేయస్వామి ఆలయం, మిట్టబండ ఆంజనేయస్వామి ఆలయాల్లో స్వామివార్లకు ఆకుపూజ అలంకరణ, విశేష పూజలు, అర్చనలు, అభిషేకాలు, కన్నులపండువగా నిర్వహించారు. అదేవిధంగా చంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో సైతం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.